నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
మెదక్
ఆదివారం | 09 జూన్ 2024 | www.navatelangana.com

ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-రాయపోల్



ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన దౌల్తాబాద్ మండలం తిరుమలాపూర్ గ్రామంలో శనివారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం మండలంలోని తిరుమలాపూర్ గ్రామానికి చెందిన గడ్డం ఆంజనేయులు తన వ్యక్తిగత పనుల నిమిత్తం దౌల్తాబాద్ వెళ్లాడు. పని ముగించుకొని తిరిగి సొంత గ్రామమైన తిరుమలాపూర్ వస్తున్న క్రమంలో మల్లేశంపల్లి బస్టాండ్ దగ్గరకు రాగానే ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడ్డాడు. ఈ ఘటనలో ఆంజనేయులు కుడి కన్నుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అక్కడి స్థానికులు 108 అంబులెన్స్‌కి సమాచారం ఇవ్వగా దౌల్తాబాద్ 108 సిబ్బంది ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ భాను, పైలట్ జనార్ధన్ అక్కడికి చేరుకొని ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గజ్వేల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

లోక్ అదాలత్‌లో 626 కేసులు పరిష్కారం

నవ తెలంగాణ-దుబ్బాక



జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా దుబ్బాక కోర్టు పరిధిలో 626 కేసులు పరిష్కార మయ్యాయని జూనియర్ సివిల్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి వీ.తరణి తెలిపారు. శనివారం దుబ్బాక పురపాలిక కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టు కం జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన 'జాతీయ లోక్ అదాలత్' కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. లోక్ అదాలత్ కార్యక్రమానికి కక్షిదారుల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. 626 కేసుల్లో, 1- సివిల్ కేసు,300- క్రిమినల్ కేసులు, 221- ఈ-పిట్టీ కేసులు, 10- బ్యాంకు కేసులు,16- సైబర్ క్రైమ్ కేసులను పరిష్కరించడం జరిగిందన్నారు.

జాతీయ స్థాయి టార్గెట్ బాల్ పోటీలకు ఎంపిక

నవతెలంగాణ-రాయికోడ్





రాజస్థాన్‌లోని అల్వార్‌లో ఈనెల 10 నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్న 11వ జాతీయ స్థాయి టార్గెట్ బాల్ పోటీలకు తెలంగాణ సీనియర్ పురుషుల జట్టుకు మండలంలోని రాధా కృష్ణ మెమోరియల్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న పీఈటీ బీ. మధుసూదన్, వై ప్రవీణ్ కుమార్ పదో తరగతి విద్యార్థి రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. జాతీయ స్థాయికి ఎంపికైన వీరికి పాఠశాల కరస్పాండెంట్ కె. పాండు అభినందించారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



నవతెలంగాణ-మునిపల్లి

మండల పరిధిలోని బుసారెడ్డిపల్లి గ్రామంలో శ్రీ నల్ల పోచమ్మ దేవాలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోనాలను గ్రామ పురవీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్లి.. అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రాసమ్ములు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బోనాల పండుగలో పాల్గొన్న పీసీసీ సభ్యులు శ్రీనివాస్

నవతెలంగాణ-కల్హేర్

మండలంలోని పోమ్యానాయక్ తాండాలో శనివారం నిర్వహించిన బోనాల పండుగ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు కే.శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో దేవదాస్, ఫహీమ్, లతీఫ్, సత్యగౌడ్, బాలిరెడ్డి, నారాయణఖేడ్ మండల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివకు మార్, రాఘవేంద్ర, చాంద్, శంకర్, పండరి, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

రాజీయే రాజమార్గం

జాతీయ లోక్ అదాలత్‌లో 2064 కేసుల పరిష్కారం

నవతెలంగాణ-గజ్వేల్



మండల్ లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ ప్రిన్సిపల్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి బి. ప్రియాంక ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడదగిన క్రిమినల్ కేసులు బ్యాంక్ కేసులు అన్ని కలిపి దాదాపు 2064 కేసులు పరిష్కారం అయ్యాయని మండల్ లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ ప్రిన్సిపల్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రియాంక తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీయే రాజమార్గమని, చిన్నచిన్న సమస్యలతో కక్షలు పెంచుకుంటున్నారని పేర్కొన్నారు. ఇటువంటి కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకోవడమే సరైన మార్గమని, లోక్‌అదాలత్ ఎంతో ప్రయోజనకరమని చెప్పారు. లోక్ అదాలత్‌లో వెలువరించిన తీర్పు తుది తీర్పు అన్నారు. లోక్ అదాలత్ ద్వారా ఉచితంగా న్యాయసహాయం పొంది సమస్యను పరిష్కరించుకోవాలని చెప్పారు. క్షణికావేశంలో చిన్నచిన్న తప్పులు చేసి అనవసరంగా భవిష్యత్తును పాడు చేసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. అధికారులు సమన్వయంతో పని చేయడం వల్ల చిన్నచిన్న కేసులు సులభంగా పరిష్కరించవచ్చని చెప్పారు. పోలీసు, రవాణా, ఇన్సూరెన్స్, బ్యాంకింగ్ అధికారులు సహకరించడం ద్వారా అనేక కేసులు సులభంగా పరిష్కారమవుతాయని చెప్పారు. లోక్‌అదాలత్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని బంగారు భవిష్యత్తుకు నాంది పలకాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు పాండరి, న్యాయవాదులు, జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులు దేశబోయిని నర్సింహులు మండల్ లీగల్ సర్వీస్ సిబ్బంది నరసింహ్మాచారి, యామిని కోర్టు సిబ్బంది పోలీసు సిబ్బంది వివిద బ్యాంకుల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

11వ తేదీన మూడవ వార్షికోత్సవ వేడుకలు

శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ యూనివర్సిటీ

నవతెలంగాణ-ములుగు



సిద్దిపేట జిల్లా, మండల కేంద్రంలోని శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ యూనివర్సిటీ 3వ వార్షికోత్సవ వేడుకలు ఈనెల 11వ తేదీన నిర్వహిస్తున్నట్లు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ నీరజ ప్రభాకర్ తెలిపారు. వైస్ ఛాన్సలర్ నీరజ ప్రభాకర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా తమిళనాడు హార్టికల్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ గీతాలక్ష్మి వస్తున్నారన్నారు. హార్టికల్చర్ యూనివర్సిటీ నుంచి 287 మంది విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్నట్లు తెలిపారు. యూనివర్సిటీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ అందజేస్తున్నట్లు తెలిపారు.

ఇరువురు దొంగల అరెస్ట్


నవతెలంగాణ-అక్కన్నపేట



గత కొంతకాలంగా దొంగతనాలకు పాల్పడుతూ తప్పించుకొని తిరుగుతున్న ఇద్దరూ దొంగలను శనివారం అరెస్టు చేశామని అక్కన్నపేట ఎస్సై తాండ్ర వివేక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సిరిగిరి సాయిబాబా అలియాస్ సాయికుమార్ (34) భువనగిరి జిల్లా మోత్కూరు మండలానికి చెందిన వ్యక్తి. అలాగే గంధం అర్జున్ (20) చిన్నకల్వల సుల్తానాబాద్ మండలానికి చెందిన వ్యక్తి. ఈ ఇద్దరు కలిసి గత కొంతకాలంగా దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులను తప్పించుకుని తిరుగుతున్నారు. ఇప్పటికే వీరు యాదాద్రి భువనగిరి, వరంగల్ నల్లగొండ జనగాం హుజూర్‌నగర్ ప్రాంతాల్లో వరుసగా 20కి పైగా దొంగతనాలు చేసి పోలీసులు పట్టుబడ్డారు. కొన్నాళ్లపాటు శిక్ష అనుభవించి బయటకు వచ్చిన వీరు 19-05-2024 రోజున అక్కన్నపేట గ్రామానికి చెందిన కనకయ్య ఇంట్లో చొరబడి వెండి బంగారు ఆభరణాలు దొంగిలించారు. మల్లంపల్లి స్కూల్లో నల్ల పైపులు దొంగిలించారు. అలాగే గంగాధర మండలం వెంకటాయపల్లి స్టేజి వద్ద ఒక యూనికాన్ బైక్‌ను కూడా దొంగిలించారు. ఈ సొత్తును తన స్నేహితుడైన గంధం అర్జున్‌తో కలిసి కొండగట్టులో 60 వేలకు విక్రయించారు. అయితే సాయిబాబా జూన్ 8 అదే యూనికాన్ బైక్‌పై వస్తుండగా ఉదయం 5 గంటల ప్రాంతంలో మండలంలోని కట్కూరు స్టేజి వద్ద పోలీసులు పట్టుకొని అతని వద్ద ఉన్న 30 గ్రాముల బంగారం 166 గ్రాముల వెండిని స్వాధీనం చేసుకుని అతన్ని కోర్టులో హాజరు పరిచామని ఎస్ఐ తెలియజేశారు.

ఇచ్చిన మాట ప్రకారమే ఆరు గ్యారెంటీలు అమలు

నవతెలంగాణ-కొమురవెల్లి



కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారమే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహదేవుని శ్రీనివాస్ అన్నారు. ఖమ్మం, నల్లగొండ, వరంగల్ పట్టభద్రుల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ఘనవిజయం సాధించిన సందర్భంగా శనివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహదేవుని శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం మహదేవుని శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారమే కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు లింగంపల్లి శ్రీనివాస్, సనాది భాస్కర్, చెరుకు రమణ రెడ్డి, పబ్బోజు రాములు చారీ, సార్ల లింగం, బ్రాహ్మణపల్లి చంద్రం, ఎక్కలుదేవి శ్రీనివాస్, మల్లం బాలయ్య, మోహన్ రెడ్డి, జనగాం శ్రీకాంత్, జంగని రవి,చింతల రమేష్, గొల్లపల్లి శ్రీనివాస్, మెడికుంట శ్రీనివాస్, స్వాములపల్లి రమేష్, ఎర్రులరాజు, ప్రభాకర్, ఉప్పలా వంశీ, మాట్లా మురళి, గుండా మహేష్, గోదాల నవీన్, కనుగుల బాబు, ఎనిశెట్టి కిరణ్ పుట్ట రమేష్, బూడిగే అనిల్ గౌడ్, ఎదుల గణేష్, అందే వీరేశం, బూడిగే బిక్షపతి గౌడ్, దండు చంద్రం, కంకణాల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

టీపీసీసీ రేసులో...

జగ్గారెడ్డి, పొన్నం, షేట్కర్







- జగ్గారెడ్డికి రాహుల్‌తో సన్నిహిత సంబంధాలు
- మంచి ఆర్గనైజర్ అంటూ గతంలో కితాబు
- బీసీ కోటాలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ సురేష్ షెట్కర్
- మంత్రి వర్గ విస్తరణకు ముందే అధ్యక్షుడి ప్రకటన
- ఢిల్లీ పెద్దలతో లాబీయింగ్ నడుపుతున్న నేతలు
- నామినేటేడ్ పదవుల కోసం ఆశవాహులు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

వరుస ఎన్నికలు ముగిసేసరికి కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టింది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలో మంచి ఫలితాలు రాబట్టాలంటే పార్టీ పరంగా ప్రభుత్వం పరంగా సన్నద్ధం కావాలని చూస్తుంది. మంత్రివర్గంతో పాటు టీపీసీసీ అధ్యక్ష పదవి, ఇతర నామినేటేడ్ పదవుల భర్తీపై కసరత్తు ప్రారంభించింది. ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి నాలుగు చోట్ల ఎమ్మెల్యేలున్నారు. ఏడు చోట్ల ఓటమి పాలయ్యారు. పార్టీ, నామినేటేడ్ పదవుల్ని ఆశిస్తున్న నాయకులు చాలా మందే ఉన్నారు. ముఖ్యంగా టీపీసీసీ పదవి రేసులో పలువురు పేర్లు వినిపిస్తున్నాయి. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న మాజీ ఎమ్మెల్యే తూర్పు జయప్రకాశ్‌రెడ్డి రాష్ట్ర స్థాయి పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయన సైతం టీపీసీసీ రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. బీసీ సామాజిక వర్గానికి ఇవ్వాల్సి వస్తే మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ సురేష్ షెట్కర్ పేర్లు కూడా పరిశీలిస్తున్నట్లు చర్చ నడుస్తోంది. నామినేటేడ్ పదవుల కోసం కూడా అనేక మంది ఆశవాహులు ఎదురు చూస్తున్నారు.

టీపీసీసీ రేసులో జగ్గారెడ్డి

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికీ సంగారెడ్డి నుంచి జగ్గారెడ్డి ఓటమి పాలవ్వడంతో మంత్రి పదవికి దూరమయ్యారు. ఎమ్మెల్యేగా గెలిచి ఉంటే రేవంత్‌రెడ్డి మంత్రివర్గంలో చోటు లభించేది. ఓటమిపాలైనప్పటికీ పార్టీలో యాక్టీవ్ రోల్ పోషిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి అనుకూలంగా వ్యవహరించడమే కాకుండా బీఆర్ఎస్, బీజేపీ లాంటి ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొడుతూ పార్టీ, ప్రభుత్వ విధానాన్ని చెప్పడంలో ముందుంటున్నారు. కాంగ్రెస్ పార్టీలో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న జగ్గారెడ్డి ఢిల్లీ స్థాయిలో రాహుల్ గాంధీ, సోనియాగాంధీ ఇతర ముఖ్య నాయకులతోనూ సత్ సంబందాలున్నాయి. జోడో యాత్ర, అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభల్లో జగ్గారెడ్డి పనితీరును చూసి రాహుల్ గాంధీ ఫిదా అయ్యారు. జగ్గారెడ్డి మంచి ఆర్గనైజర్ అంటూ కితాబిచ్చారు. పలుమార్లు ఢిల్లీకి వెళ్లిన సందర్భంలోనూ జగ్గారెడ్డికి రాహుల్ గాంధీ తగిన ప్రాధాన్యత ఇవ్వడం గమనించాం. ఎమ్మెల్యే, మంత్రి, ఎంపీ పదవులేవీ లేనందున పార్టీ పరమైన పనులు చేస్తానంటూ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన మొదట్లోనే జగ్గారెడ్డి చెబుతూ వచ్చారు. పార్టీ అధిష్టానం పార్టీ పనులు అప్పజెబితు శక్తివంతన లేకుండా చేస్తానంటూ పార్టీ పెద్దల దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేశారు. సంగారెడ్డి జిల్లాలో ప్రోటోకాల్ సమస్య ఉత్పన్నమవడంతో సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే జగ్గారెడ్డి సతీమణీ నిర్మాలాజగ్గారెడ్డికి రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమించారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లోనూ నీలం మధును కాంగ్రెస్‌లో చేర్చడం, ఎంపీ టికెట్ ఇప్పించడం, ఆయన గెలుపు కోసం కష్టపడి పనిచేయడంలో జగ్గారెడ్డి కృషిని పార్టీ గుర్తించింది. సంగారెడ్డి నియోకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధుకు 75287 ఓట్లు రావడంతో జగ్గారెడ్డి కృషి కనిపించిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇవన్నీ తనకు సానుకూల అంశాలుగా బావిస్తున్న జగ్గారెడ్డి టీపీసీసీ పదవిని ఆశిస్తూ ఢిల్లీ పెద్దలతో లాబియింగ్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

బీసీ కోటాలో పొన్నం, షేట్కల్

ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డినే టీపీసీసీ ప్రెసిడెంట్‌గా కొనసాగుతున్నారు. ఇక నుంచి ఆ పదవిని మరొకరికి ఇవ్వాలని పార్టీ నిర్ణయించడంతో ఆయా సామాజిక వర్గాల పేర్లు తెర మీదికి వస్తున్నాయి. ముఖ్యంగా పార్టీ పరమైన కీలక పదవి టీపీసీసీని బీసీ సామాజిక వర్గానికి ఇవ్వాలనే చర్చ నడుస్తుంది. దీంతో హుస్నాబాద్ ఎమ్మెల్యే రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పేరు కూడా వినిపిస్తుంది. గౌడ సామాజిక వర్గానికి పదవి ఇవ్వాల్సి వస్తే పొన్నం పేరు పరిశీలించే అవకాశముందంటున్నారు. పొన్నం ప్రభాకర్ యూత్ కాంగ్రెస్ లీడర్‌గా ఎదిగి ఉమ్మడి రాష్ట్రంలో కరీనంగర్ ఎంపీగా గెలిచారు. స్వరాష్ట్రం కోసం కొట్లాడిన ఎంపీల్లో కీలకంగా వ్యవహరించారు. ఢిల్లీ పెద్దలతోనూ మంచి సంబంధాలున్నాయి. ప్రతిపక్షాలకు కౌంటర్ ఇవ్వడంలోనూ సబ్జెక్ట్ ఉంది. ఇక సీఎం రేవంత్‌కు సన్నిహితుడుగా కాంగ్రెస్ పార్టీకి విధేయుడుగా ఉన్న జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్ పేరు కూడా చర్చకు వస్తుంది. ఆయన లింగాయత్ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికావడం కొంత మైనస్ అయినప్పటికీ పార్టీలో సీనియర్‌గా కొనసాగుతుండడం, ఎంపీగా, ఎమ్మెల్యే పనిచేసిన అనుభవముంది. మొత్తం మీద సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాకు చెందిన ముగ్గురు నాయకులు టీపీసీసీ రేసులో ఉన్నారు. వీరిలో ఎవరికి పదవి దక్కినా ఈ ప్రాంతంలో పార్టీ మరింత బలపడేందుకు అవకాశాలుంటాయని కాంగ్రెస్ సీనియర్ నాయకులు తొపాజీ అనంతకిషన్ పేర్కొన్నారు.

నామినేటేడ్ పదవుల కోసం ఆశవాహులు

రాష్ట్ర, జిల్లా స్థాయిలో అనేక నామినేటేడ్ పదువులున్నాయి. వీటిని త్వరలోనే భర్తీ చేయనున్నారు. రాష్ట్ర స్థాయి పదవులు, జిల్లా స్థాయి పదవుల కోసం మూడు జిల్లాల నుంచి అనేక మంది ఆశవాహులున్నారు. ముఖ్యంగా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓడిపోయిన వాళ్లందరూ ఏదో ఒక పదవి కోసం ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉమ్మడి మెదక్ జిల్లాకు ఒకే ఒక నామినేటేడ్ పదవి దక్కింది. అది కూడా ప్రోటోకాల్ సమస్య రావడంతో నిర్మళా జగ్గారెడ్డికి రాష్ట్ర స్థాయి చైర్మన్ పదవి ఇచ్చారు. పటాన్‌చెరులో ఓడిపోయిన కాట శ్రీనివాస్ గౌడ్, జహీరాబాద్‌లో ఓడిపోయిన మాజీ మంత్రి చంద్రశేఖర్, నర్సాపూర్‌కు చెందిన ఆవుల రాజిరెడ్డి, మదన్‌రెడ్డి ఇద్దరు కూడా నామినేటేడ్ పదవుల్ని ఆశిస్తున్నారు. నర్సాపూర్‌లో కాంగ్రెస్‌కు మంచి ఓట్లు పోలవ్వడంతో వీళ్లిద్దరి కృషి ఉంది. ఇక గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూకుంట నర్సారెడ్డి సైతం ఏదో ఒక ప్రోటోకాల్ పదవిని ఆశిస్తున్నారు. ఇక్కడ కూడా కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థికి మంచి ఓట్లు పడ్డాయి. వీరితో పాటు ఇతర పార్టీల నుంచి చేరిన నాయకులున్నారు. ఇక మూడు జిల్లాల్లోనూ జిల్లా స్థాయి పదవుల కోసం ఆశతో ఎదురు చూస్తున్నారు.

లోక్ అదాలత్ ద్వారా 3059 కేసులు పరిష్కారం

జిల్లా జడ్జి భవాని చంద్ర

నవతెలంగాణ-సంగారెడ్డి



జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ రాష్ట్ర అధికార సంస్థ ఉత్తర్వుల మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మెన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.భవాని చంద్ర అధ్యక్షతన శనివారం సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా, జిల్లా కోర్టు సంగారెడ్డి ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయ మూర్తి జి. భవాని చంద్ర మాట్లాడుతూ.. జాతీయ లోక్ అదాలత్ రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకొని సత్వర న్యాయం అందుతుందన్నారు. మూడు జంటలు రాజీమార్గాన కలిశారన్నారు. మొదటి జంట సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టుకు సంబంధించిన కేసు ఎస్సీ నంబర్ 126 కుమ్మరి సూర్యకాంత్, అనిత సదాశివపేట వాస్తవ్యులు, రెండో జంట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు సంబంధించిన కేసు సీసీ నెంబర్ 665 బై 2022 సరిత రాజిరెడ్డి స్పెషల్ ఎక్సైజ్ కోర్టుకి సంబంధించిన కేసు డివిసి నెంబర్ 13/2023 అనూష నాగరాజు పటాన్చెరు వాస్తవ్యులు.. ఈ మూడు జంటలు కలవడం చాలా సంతోషాన్ని ఇచ్చిందన్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ రకాలు కేసులు నష్ట పరిహారం ఇప్పించడం జరిగిందన్నారు. ఎంవీటపి కేసులు 15, నష్టపరిహారంగా రూ.65,28,000, సివిల్ కేసులు 08, క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు 2,832, ఎల్ ఏ ఓపి కేసులు 07, బ్యాంక్ రికవరీ కేసులు 48, ఏపీ టీఎస్ కేసులు 06, విద్యుత్ చౌర్యం ప్రిలిటిగేషన్ కేసులు 143 మొత్తం కేసులు 3059 కేసులు పరిష్కరించడం జరిగిందన్నారు.ఈ లోక అదాలత్‌లో జడ్జిలు జయంతి,కృష్ణార్జున, సునీత రవీంద్రా రెడ్డి, లావణ్య, రాధా కృష్ణ చౌహన్, జిల్లా న్యాయా సేవధికారి సంస్థ కార్యదర్శి రమేష్, లక్ష్మణ్‌చారి, తేజశ్రీ, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విష్ణువర్ధన్ రెడ్డి, ప్రభుత్వ తరపు న్యాయవాది నర్సింగ్ రావు, సీనియర్ న్యాయ వాదులు, కక్ష దారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్డీఏ ప్రభుత్వం కూలడం ఖాయం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సంచలన వ్యాఖ్యలు

నవతెలంగాణ-జహీరాబాద్



కేంద్రంలో నూతనంగా ఏర్పాటు కానున్న ఎన్డీఏ ప్రభుత్వం త్వరలోనే కూలిపోవడం ఖాయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. జహీరాబాద్ పట్టణంలోని భరత్‌నగర్‌లో గల పార్టీ కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ముందుగా రామోజీరావు మృతి మీడియా రంగానికి తీరని లోటు అని.. ఆయన సేవలు మరువ లేనివన్నారు. కమ్యూనిస్టు పార్టీ సీపీఐ సానుభూతిపరులైన ఆయన.. పార్టీకి అనేక రూపాలుగా సేవలు అందించారన్నారు. మీడియా లోకానికి కాకుండా పత్రికా రంగాన్ని దేశవ్యాప్తంగా విస్తరించిన గొప్ప ఘనుడు అని కొనియాడుతూ.. ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ప్రస్తుతం దేశ రాజకీయాల్లో.. ప్రజలు కులమత బేధాలు లేకుండా పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, ప్రజా స్వేచ్ఛను గెలిపించారన్నట్టుగా ఫలితాలు వచ్చాయన్నారు. బీజేపీ ప్రభుత్వానికి సంపూర్ణ మెజార్టీ రాలేదని.. రానున్న కాలంలో ఆ ప్రభుత్వం కూలిపోవడం ఖాయమన్నారు. తెలుగు రాష్ట్రాలకు అన్యాయం చేసిన బీజేపీకి చంద్రబాబు నాయుడు మద్దతు ఇవ్వడం సరికాదన్నారు. ఇకమీదటైనా తమ వైఖరిని మార్చుకోవాలన్నారు. మత విద్వేషాలు రెచగొట్టి ఓట్లు దండుకుని రాజ్యమేలుతున్న పార్టీలకు కాకుండా ప్రజాస్వామ్యం కాపాడే దిశగా ఆలోచన చేసుకుంటే బాగుండేదన్నారు. జహీరాబాద్‌లో ఎంతోకొంత పరిశ్రమలు ఉండడం వలన అనేక ప్రాంతాల నుంచి వలస జీవులుగా వచ్చి ఏళ్ల తరబడి నుండి ఇక్కడే ఉంటున్నవారికి కనీసం ఇండ్లు కూడా లేని దుస్థితి ఉన్నదన్నారు. వారందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చే దిశగా స్థానిక నాయకులు చొరవ చూపాల న్నారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి జలలొద్దీన్ మాట్లా డుతూ.. త్వరలో ప్రజలందరినీ కూడగట్టి సమస్యల పరిష్కా రానికై పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఆనంద్ పార్టీ నాయకులు నర్సింలు, అజారుద్దీన్, చిరంజీవి,అశోక్, దత్తు రెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.

నీట్ అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలి

నవతెలంగాణ-సిద్దిపేట : నీట్ అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని, రీ -ఎగ్జామ్ నిర్వహించాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ)ను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఆముదలా రంజిత్ రెడ్డి, జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ జూన్ 04న ఎలాంటి హడావుడి లేకుండా, దేశంలో సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెల్లవడుతున్న సమయంలో, నీట్ పరీక్ష ఫలితాలు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్.టి.ఎ) ప్రకటించిందన్నారు. ముందుగా జూన్ 14న అని ప్రకటించి, ముందుగానే ఎలాంటి సమాచారం లేకుండా ఫలితాలు వెల్లడించడంపై దేశ వ్యాప్తంగా అనేక ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ప్రధానంగా ఎన్.టి.ఎ ను తీసుకుని వచ్చిన నుంచి దాని పారదర్శకతపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, గత పరీక్షలలో ఎన్.టి.ఎ.చేసిన ఘోర తప్పిదాలను, అవకతవకలు మళ్ళీ పునారవృతం అవుతున్నాయన్నారు. ఎంబిబిఎస్-బిడిఎస్ గ్రాడ్యుయేట్ స్థాయి ప్రవేశ పరీక్షలో మొత్తం మార్కులు 720 కాగా, ప్రతి సరైన సమాధానానికి 4 మార్కులు ఇవ్వబడతాయని, అయితే ప్రతి తప్పు సమాధానానికి మొత్తం నుంచి 1 మార్కు తీసివేయబడుతుందని, అయితే సమాధానం లేని ప్రశ్నలు గుర్తించబడవని, అలాంటప్పుడు, 719, 718 వంటి మార్కులు పొందడం గణితశాస్త్రంలో సాధ్యం కాదన్నారు. కానీ అలాంటి ఫలితాల్లో కనిపించాయన్నారు. ఈ ఏడాది పరీక్షకు ముందు ఎన్‌టిఏ ప్రచురించిన మార్గదర్శకాలలో ఎక్కడా ఈ గ్రేస్ మార్కింగ్ పథకం గురించి ప్రస్తావించలేదన్నారు. ఒకే సెంటర్ నుంచి వరుసగా రోల్ నంబర్లు ఉన్న విద్యార్థులు ఒకే మార్కులను పొందారని ఫిర్యాదులు ఉన్నాయని, 720 కి 720 వచ్చాయని, అంటే ఈ ఫలితాలను బట్టి అభ్యర్థులు ఇక నుంచి ర్యాంకులు వచ్చిన ఆయా ప్రైవేట్ కాలేజీలలో అడ్మిషన్ తీసుకోవాల్సి వస్తుందని, ఇది సిలబస్‌లో గణనీయమైన తగ్గింపు వంటి ఎన్‌టిఏ విధానాల కారణమన్నారు. మోదీ ప్రభుత్వ హయాంలో ఎన్ఎంసీ, ఎన్‌టీఏ సంయుక్తంగా వైద్య విద్యను ప్రైవేటీకరించిన తీరు దేశ భవిష్యత్తుకు ప్రమాదకరమన్నారు. వైద్య రంగంలో రాష్ట్ర ఆధారిత ఉమ్మడి ప్రవేశ పరీక్ష విధానాన్ని మార్చడం వల్ల అంతులేని అవినీతి జరిగిందన్న వాదన ఇప్పుడు నీట్-యూజీకి సంబంధించి కూడా ముందుకు వస్తోందన్నారు. ఈ ఘటనపై తక్షణమే పారదర్శకంగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నీట్ అవకతవకలపై రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిస్తున్నట్లు తెలిపారు.

కంటైనర్లలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా

136 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం.. ఇద్దరిపై కేసు నమోదు

నవతెలంగాణ-దుబ్బాక



పేదలకు కడుపు నింపే రేషన్ బియ్యం అక్రమ దందాకు అడ్డు అదుపు లేకుండా పోయింది. పలుమార్లు పట్టుబడ్డా, కేసులు నమోదు చేసినా అక్రమార్కుల్లో మార్పు రావడం లేదు. తాజాగా జరిగిన సంఘటన సినీఫక్కీని తలపించింది. భారీ ఎత్తున రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న 2 గూడ్స్ కంటైనర్ వాహనాలను సీజ్ చేయడంతో పాటుగా ఇద్దరిపై దుబ్బాక పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ వీ.గంగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా జిల్లెల్ల గ్రామానికి చెందిన రాజుకు సంబంధించిన టీఎస్08యుఎఫ్ 6245 నెంబరు గల గూడ్స్ కంటైనర్ వాహనంలో ఇదే గ్రామానికి చెందిన పర్వతం నరేష్ అనే వ్యక్తి 136 క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నాడు. సిద్దిపేట నుంచి మెదక్ వైపు వెళ్తున్న క్రమంలో శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో దుబ్బాక మండల పరిధిలోని మర్రికుంట శివారులో రోడ్డు డివైడర్ ను ఢీకొనడంతో కంటైనర్ వాహనం పక్కకు ఒరిగింది. విషయాన్ని తన యజమాని రాజుకు ఫోన్ చేసి తెలుపగా వెంటనే అతను మరొక కంటైనర్‌ను తీసుకొచ్చి ప్రమాదానికి గురైన కంటైనర్ వాహనం నుంచి మరో కంటైనర్‌లోకి పీడీఎస్ బియ్యాన్ని లోడింగ్ చేస్తున్నారు. సమాచారం అందుకున్న దుబ్బాక పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకుని, యజమానిని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని దుబ్బాక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జిల్లా సివిల్ సప్లై కార్యాలయానికి చెందిన అధికారి రాజిరెడ్డికి పట్టుకున్న 136 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అప్పగించారు. ఆయన ఫిర్యాదు మేరకు వాహన డ్రైవర్ నరేష్, యజమాని రాజులపై కేసు నమోదు చేయడంతో పాటుగా 2 గూడ్స్ కంటైనర్ వాహనాలను సీజ్ చేయడం జరిగిందని ఎస్ఐ గంగరాజు తెలిపారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

- ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం

నవతెలంగాణ-మర్కుక్



బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని చేబర్తి జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు శంకర్ రెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింలు అన్నారు. శనివారం జిల్లా పరిషత్ పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల బృందం ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట నిర్వహించారు. గ్రామంలో బడి ఈడు విద్యార్థుల ఇంటింటికి ర్యాలీగా వెళ్లి వారి తల్లిదండ్రులను కలిసి మాట్లాడి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్య అందించబడుతుందన్నారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, రెండు జతల యూనిఫామ్స్, ఉచిత నోట్ బుక్స్ అందిస్తున్నమని తెలిపారు. ఈ కార్యక్రమంలో షాబోద్దీన్, నర్సింగారావు,రామకాంత్ రావు, రవీంద్రరావు, విశ్వేశ్వర్, ప్రశాంతి, నాగలక్ష్మి, జ్యోతి, సుదీష్ణ, స్వాతి, ఉపాధ్యాయులు , తల్లిదండ్రులు, తదితరులున్నారు.

యాదగిరిగుట్ట బస్ సర్వీస్ ప్రారంభం

నవ తెలంగాణ-దుబ్బాక



దుబ్బాక నుంచి సిద్దిపేట, చేర్యాల మీదుగా యాదగిరిగుట్టకు వెళ్లే బస్సు సర్వీసును దుబ్బాక బస్సు డిపో సీనియర్ ట్రాఫిక్ సూపర్ వైజర్ కనకలక్ష్మి శనివారం ప్రారంభించారు. డిపో ఇన్చార్జ్ మేనేజర్ వై.సుఖేందర్ రెడ్డి సూచనల మేరకు యాదగిరిగుట్టకు గతంలో ఉన్న బస్సు సర్వీసును ఈ నెల 8వ తేది నుంచి తిరిగి పునరుద్ధరించడం జరిగిందన్నారు. దుబ్బాక నుంచి ప్రతిరోజు ఉదయం 5 గంటలకు బయలుదేరే ఈ బస్సు సర్వీసును దుబ్బాక పరిసర ప్రాంతాల ప్రజలు, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక డిపో ఉద్యోగులు లింగం గౌడ్, గోపాల్, పలువురున్నారు.

మృగశిల రోజున చేపల గిరాకి అంతంత మాత్రమే..

నవతెలంగాణ-గుమ్మడిదల



మృగశిల కార్తిని పురస్కరించుకుని ఆ రోజున చేపలు తినడం ఆనవాయితీగా వస్తున్న విషయం విధితమే. అయితే ఈ సారి మృగసారి కార్తి శనివారం రోజున రావడంతో.. చేపల గిరాకీ తగ్గింది. మండలంలోని గుమ్మడిదల, బొంతపల్లి, అన్నారం, కానుకుంట, నల్లవల్లి గ్రామాల్లో అంతంత మాత్రమే చేపల కొనుగోలు జరిగినట్టు మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు ఉప్పరి వెంకటేష్ తెలిపారు. కొర్రమీను 600 - 800 రావుట, బంగారు తీగ, జేల్లా చేపలకు రూ.200 నుండి 300 కేజీ చొప్పున అమ్మినప్పటికీ శనివారం కావడంతో ఎక్కువగా అమ్ముడుపోలేదన్నారు. కాగా నేడు ఆదివారం కావడంతో ఈరోజైనా గిరాకీ జరుగుతుందని వ్యాపారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గుట్కాలు అమ్మితే కఠిన చర్యలు

నవతెలంగాణ-రాయికోడ్



గుట్కాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్ఐ వెంకటరెడ్డి హెచ్చరించారు. మండల కేంద్రమైన రాయికోడ్‌లోని పోలీస్ స్టేషన్ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత నెల 24 నుంచి గుట్కాలను రాష్ట్రంలో నిషేధించిందన్నారు. మండలంలో కిరాణా షాపులు, పాన్‌షాపులు, దుకాణ సముదాయాల్లో ఎవరైనా గుట్కాను విక్రయించినా.. రవాణా, నిలువ చేసినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గుట్కాలు తిని ఆరోగ్యాలను పాడు చేసుకోవద్దని సూచించారు. గుట్కాలు ఎవరైనా అమ్మినట్టు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని.. వారి వివరాను గోప్యంగా ఉంచుతామన్నారు.



జాతీయ లోక్‌అదాలత్‌లో 68 కేసులు పరిష్కారం.

నవతెలంగాణ-జహీరాబాద్

కేసులన్నింటిని సత్వరంగా పరిష్కరించేందుకే లోకదాలత్ నిర్వహిస్తున్నామని.. శనివారం నిర్వహించిన లోక్‌అదాలత్‌లో 68 కేసులు పరిష్కారం అయినట్టు సీనియర్ సివిల్ జడ్జి సూరి కృష్ణ తెలిపారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ జహీరాబాద్ ఆధ్వర్యంలో స్థానిక కోర్ట్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో సీనియర్ కోర్టు విభాగంలో 29 బ్యాంకు పిఎల్సీ మరియు 10 సైబర్ క్రైమ్ కేసులు పరిష్కారం అయ్యాయన్నారు. బ్యాంకు పిఎల్సి మరియు సైబర్ క్రైమ్ కేసుల నుంచి రూ.37,84,134 వసూలు అయ్యాయని , జూనియర్ కోర్టు విభాగంలో సివిల్ 1 కేసు, క్రిమినల్ కాంపౌండ్ 8 కేసులు, 1 సెకండ్ క్లాస్ కేసు, 5 అడ్మిషన్ కేసులు,14 ఎక్సయిజ్ కేసులు పరిష్కారం కాగా 1,14,000/- వసూలు అయ్యాయని తెలిపారు.



ఘనంగా మాజీ మంత్రి చంద్రశేఖర్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-జహీరాబాద్

మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ ఇన్‌చార్జి డాక్టర్ ఏ చంద్రశేఖర్ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి మండలాల అధ్యక్షులు హన్మంత్‌రావు పాటిల్ ,శ్రీనివాస్ రెడ్డి రామలింగారెడ్డి, మక్సుద్, బ్లాక్ ప్రెసిడెంట్ హర్షద్ అలీ, కండెం నర్సింహులు, భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు జావీద్, తిరుపతి రెడ్డి, ఉదయ్ పాటిల్ తదితరలు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పలువురు కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబురాలు జరిపారు.



సర్కారు బడుల్లో పిల్లలను చేర్పించండి

నవతెలంగాణ-న్యాల్‌కల్

బడిబయట పిల్లలను గుర్తించి.. ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ మారుతి రాథోడ్ అన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం బడిబాట కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. బడి బాటలో భాగంగా ఇంటింటికి తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈనెల 19 తేదీ వరకు బడిబాట కొనసాగుతుందన్నారు. ఇంటింటికి తిరిగి విద్యార్థుల సంఖ్య పెంచాల్సిన బాధ్యత హెచ్‌ఎంలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం విజయ కుమారి, ఉపాధ్యాయులు ఉన్నారు.



అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో నాణ్యత పాటించాలి

నవతెలంగాణ-మునిపల్లి

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ కింద పాఠశాలల్లో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మునిపల్లి మండల విద్యాధికారి దశరథ్ తెలిపారు. మండలంలోని బుదేరా ఉర్దూ మరియు తెలుగు మీడియం పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపడుతున్న అభివృద్ధి పనులను శనివారం పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కమిటీకి సూచించారు. అనంతరం బడీడు గల పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రధానోపాధ్యాయులు వెంకటనాయుడు, ఉపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, రాజేశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



జిన్నారంలో ఘనంగా మృగశిర కార్తె

నవతెలంగాణ-జిన్నారం

జిన్నారం మండలంలో శనివారం మృగశిర కార్తె పండుగను ప్రజలు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ ప్రాంతాల్లో గల చెరువుల వద్ద చేపల కోసం కోలాహల వాతావరణం కనిపించింది. మృగశిర కార్తె సందర్భంగా చేపలు తప్పనిసరిగా తినాలనే ఆనవాయితీ వస్తున్న విషయం విధితమే. జిన్నారం మండల పరిధిలో గడ్డపోతారం, చెట్ల పోతారం ప్రాంతాల్లో ముదిరాజ్ సంఘాల తరపున సంబంధికులకు ఒక్కో ఇంటికి కిలో చొప్పున చేపలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం ప్రతినిధులు బి.నర్సింలు ఎన్. కుమార్, నగేష్, దుర్గేష్, నరసింహ, ఎంపీ శివ శంకర్, జిన్నారం మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు నార బోయిన శ్రీనివాస్, మాణిక్యం, రాము, ఎం జితేందర్, శేఖర్, మణిదీప్, మధు తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా బాట!

- నీరుగారుతున్న కార్యక్రమ లక్ష్యం
- అధికార, ప్రజా ప్రతినిధుల సమన్వయ లోపం
- కనిపించని ప్రభుత్వ టీచర్ల ప్రచారం
- ఫోటోలకే పరిమితమైన ఉపాధ్యాయులు



నవతెలంగాణ-ఝరాసంగం

బడీడు పిల్లలు.. వివిధ కారణాలతో స్కూల్ మానేసిన విద్యార్థులను చేరదీసి వారికి విద్యాబుద్ధులు నేర్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రారంభించిన బడిబాట కార్యక్రమ లక్ష్యం నీరుగారిపోతోంది. సమగ్ర శిక్షణ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం ఉపాధ్యాయుల నిర్లక్ష్యం కారణంగా మండలంలో మొక్కుబడిగా సాగుతోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో చాలామంది ఉపాధ్యాయులు క్షేత్రస్థాయికి వెళ్లకుండా ఇంట్లో కాలక్షేపం చేస్తున్నారు. మరి కొందరు ప్రధానోపాధ్యాయుల ఒత్తిడితో ఇంటి చుట్టుపక్కల పిల్లల పేర్లను నమోదు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వెల్లు వెత్తుతు న్నాయి. అంతేకాకుండా ప్రభుత్వం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఉపాధ్యాయులువిధులను నిర్వహించడం లేదని కనిపిస్తోంది.

బడిబాట కార్యక్రమానికి ఉపాధ్యాయులు ఉదయం నుంచి 11 గంటల వరకు కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుంది. కానీ నామమాత్రంగా పాఠశాల గేట్ల ముందు నిల్చుని ఫోటోలకే పరిమితం అవుతున్నారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కే.జయశంకర్ పేరిట ప్రభుత్వం ఏటా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. జూన్ 6 నుంచి ఉపాధ్యాయులు కార్యక్రమంలో పాల్గొని తమ పాఠశాలల్లో కొత్త అడ్మిషన్లను పెంచేందుకు కృషి చేయాలి. జూన్ 3 నుంచి 11 తేదీన బడిబాట కార్యకలాపాలు ఉదయం 7 గంటల నుండి 11 గంటల వరకు చేయాల్సి ఉంది. జూన్ 12 నుంచి 19 వరకు ఎన్రోల్మెంట్, పాఠశాలల్లో వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహి స్తుంటారు. రెండు వారాల పాటు జరిగే బడిబాటకు సంబంధించి ప్రభుత్వం ఒక్కో స్కూల్‌కు బడ్జెట్‌ను సైతం కేటాయించినట్లు సమాచారం. దీంతో పాఠశాలల వారీగా బ్యానర్లు, కరపత్రాలు ముద్రించి ఇంటింటికీ తిరుగుతూ.. ప్రభుత్వం పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలు, ప్రైవేటు ప్రభుత్వ పాఠశాలకు మధ్య ఉన్న వ్యత్యాసాలను విద్యార్థుల తల్లిదండ్రులకు ఒప్పించి, మెప్పించి నూతన చేరికలు చేయించాలి. కానీ టీచర్లు గ్రౌండ్ రియాల్టీకి వెళ్లడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గ్రామ వాలంటీర్లు (వీఓ)లు, అన్ని స్వయం సహాయక బృందాలు, ఏపీపీసీ సభ్యులు, హెచ్‌ఎంలు, ఉపాధ్యా యులు, హాస్టల్‌వెల్ఫేర్ ఆఫీసర్లు(హెచ్‌డబ్ల్యూఓస్), తలి దండ్రులు, పాత విద్యార్థులు 3నుండి 11వ తేదీ వరకు గ్రామ స్థాయిలో రోజు నిర్వహణ కోసం ప్రతిరోజూ పాల్గొనాలి. తెలిపైన కార్యకలాపాలు నిర్వహిచాలి. అమ లులో ఉన్న మోడల్ ప్రవర్తనా నియమావళిని దాని తర్వాత ప్రజాప్రతినిధులు పాల్గొనే విధంగా హెచ్‌ఎంలు చొరవ తీసుకోవాలి.

ఎర్నింగ్ లీవ్స్ ఇవ్వడం లేదని టీచర్ల అసహనం..

మండలంలోని ఉపాధ్యాయులు తమ పాఠశాల పరిధిలోని వీధులు, కాలనీల్లో ఉదయం 7 నుంచి 11 వరకు తిరుగుతూ ప్రభుత్వ బడులపై అవగాహన కల్పించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వివరించి పిల్లలను బడిలో చేర్పేందుకు ఒప్పించాలి. పాఠశాలలో చేరడానికి అంగీకరించిన పిల్లల పేర్లు, తల్లిదండ్రుల వివరాలతోపాటు వారి ఫొటోలను తీసి మండలస్థాయిలో ఏర్పాటు చేసిన వాట్సప్ గ్రూప్‌లో అప్‌లోడ్ చేయాలి. అయితే వేసవి సెలవులు ముగియక ముందే బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తుండడంపై కొంతమంది ఉపాధ్యాయులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితిలో బంధువులు, ఇంటి చుట్టుపక్కల పిల్లల ఫొటోలను మొక్కుబడిగా తీస్తూ అప్‌లోడ్ చేస్తున్నారు. కాగా, ఇలా నమోదు చేస్తున్న పిల్లలందరూ ప్రైవేట్ పాఠశాలల్లో ఇప్పటికే చదువు తుండడం గమనార్హం. అందరూ ఉపాధ్యాయులు ఇదే కోవాకు వస్తారని కాదు కానీ కొంతమంది టీచర్లు మాత్రమే నిబద్ధతతో పనిచేస్తున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఎర్నింగ్ లీవ్స్ ఇవ్వడం లేదు. దీంతో ఉపాధ్యాయులు బడిబాటపై పెద్దగా ఆసక్తి చూపడం లేదని.. అసహనం వ్యక్తం చేస్తున్నట్లు చర్చలు వినిపిస్తున్నాయి.

నిబంధనలు గాలికి.. నామమాత్రమే ప్రచారం

03.06.2024 నుంచి 11.06.2024 వరకు అన్ని పాఠశాలల్లో ప్రతి రోజు ఉదయం 7.00 నుండి 11.00 వరకు కింది కార్యకలాపాలు నిర్వహించాలి.

1. జిల్లా/మండల/గ్రామ స్థాయిలోని మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారుల సమన్వయంతో అర్హతగల అంగన్‌వాడీ పిల్లలు, 5ఏండ్ల వయస్సు గల పిల్లలను 1వ తరగతిలో సమీపంలోని ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించాలి.
2. మహిళా స్వయం సహాయక బృందాల సహాయంతో పాఠశాల వయస్సు, బడిబయట పిల్లలు, డ్రాప్ అవుట్లు, ఎన్నడూ నమోదు చేసుకోని పిల్లలు, ఎక్కువ కాలం గైర్హాజరైన వారిని గుర్తించి.. ఈ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఉన్నప్పటికీ ఏ ఒక్క పాఠశాలలో గానీ గ్రామంలో గాని ఇప్పటివరకు సమావేశాన్ని వీరితో నిర్వహించింది లేదు.
3. బాల కార్మికులను గుర్తించి వారిని ప్రభుత్వ పాఠశాలల్లో తగిన తరగతుల్లో చేర్పించాలి. బాల కార్మికులను గుర్తించాలంటే టీచర్లు ముమ్మరంగా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తే తప్ప అది సాధ్యపడదు. ఇప్పటివరకు ఒక్కరిని కూడా గుర్తించకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది.
4. ఆన్‌లైన్ ప్రమోషన్ యాక్టివిటీ 8వ తేదీ నాటికి పూర్తి చేయాలి.
5. పిల్లలకు పాఠశాల,విద్యపట్ల ఆసక్తిని కలిగించడానికి సంసిద్ధత కార్యక్రమాలు నిర్వహించారు.
6. సంక్షేమ హాస్టళ్ల సమీప పాఠశాల హెడ్ గురించి విస్తృత ప్రచారం జరపాల్సి ఉంటుంది.
7. 03.06.2024 నుండి 11.06.2024 వరకు మాస్టర్స్, కన్సెప్ట్ హాస్టల్ హెచ్‌డబ్ల్యూఓల కార్యకలాపాలు చేపట్టాలి.
8. 12.06.2024 నుండి 19.06.2024 వరకు నిర్వహించే బడి బాట కార్యక్రమం యొక్క అన్ని కార్యక్రమాలకు సాంప్రదాయ పద్ధతిలో తల్లిదండ్రులు, సంఘం, ప్రజా ప్రతినిధులందరికీ స్వాగతం తెలపాలి.

ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటాం

షెడ్యూల్ ప్రకారం బడిబాట కార్యక్రమం నిర్వహించని ఉపాధ్యాయులపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం. ఓ వైపు బడిబాట కార్యక్రమం, మరోవైపు ఉపాధ్యాయుల బదిలీల దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతుంది. రెండు కార్యక్రమాలు ఒకేసారి జరగడంతో బడిబాట కార్యక్రమం కొంత సజావుగా జరగకపోవడం వాస్తవమే. ఎర్నింగ్ లీవ్స్ అనేవి సమ్మర్ లో డ్యూటీ చేసిన వారికి మాత్రమే ప్రభుత్వం ఇస్తుంది. బడిబాట కార్యక్రమం అనేది పని దినాలలో భాగమే. అలాంటి వాటికి సెలవులు ఉండవు.

-శ్రీనివాస్ ఎంఈవో, ఝరాసంగం

బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలి

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి టి.లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-సంగారెడ్డి



ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా సజావుగా నిర్వహించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి టి.లక్ష్మారెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యుటిఎఫ్) సంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశాన్ని స్థానిక కేకే భవన్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి టి.లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వై.జ్ఞానమంజరి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు 9 ఏండ్లుగా పదోన్నతులు లేక, ఆరేండ్లుగా బదిలీలు చేయలేదన్నారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ ఇవ్వడం స్వాగతించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎలాంటి అవాంతరాలు రాకుండా పారదర్శకంగా, సజావుగా నిర్వహించాలని కోరారు. టీఎస్‌యూటీఎఫ్ సహకారం పూర్తి స్థాయిలో ఉంటుందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన 4 డీఏలు వెంటనే ప్రకటించాలని, చాలా కాలంగా పెండింగ్లో ఉన్న అన్ని రకాల బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీకి అనుగుణంగా సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను తీర్చడానికి వెంటనే తాత్కాలిక ఉపాధ్యా యులను (విద్యా వాలంటీర్లు) నియమించాలని, పాఠశాలల్లో తాళాలు వేసి, బెల్లు కొట్టడం, పారిశుధ్య కార్యక్రమం నిర్వహించడం కోసం సర్వీస్ పర్సన్ లను నియమించాలన్నారు. నూతన విద్యా విధానం- 2020ని రద్దు చేయాలన్నారు. మోడల్ స్కూల్ లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలపై కోర్టులో ఉన్న కేసులు వెంటనే క్లియర్ చేయడానికి ప్రభుత్వం కృషిచేసి బదిలీలు చేపట్టాలన్నారు. కేజీబీవీ అండ్ యూఆర్ఎస్ ఉపాధ్యాయ ఉద్యోగులకు బేసిక్ పే ఇవ్వాలి, బదిలీలు చేయాలన్నారు. అన్ని మేనేజ్మెంట్లలో పనిచేస్తున్న గురుకుల టీచర్లకు బదిలీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు కే.అశోక్ ప్రధాన కార్యదర్శి బి.సాయిలు, ఉపాధ్యక్షుడు జే.కాశీనాథ్, కోశాధికారీ, పి.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శిలు ఎం.నరేష్, ఎం.శమయ్య, బి.అరుణశ్రీ, బి.ఏశప్ప, బి.సాయితేజ, చందర్ రాథోడ్, వి.అనురాధ, సిహెచ్.కృష్ణంరాజు, సింహాచలం, కే. సుదర్శన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి

నవతెలంగాణ-మనూర్

బడీడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఎన్‌జి హుక్రాన ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎమ్ అక్బర్ అన్నారు. హుక్రాన గ్రామంలో శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రయివేటు పాఠశాలల్లో కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ ఉపాధ్యాయులు ఉంటారన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు దుస్తులు, పుస్త కాలు ఉచితంగా ఇవ్వడంతో పాటు భోజనం, టిఫిన్ సౌకరా ్యలు కూడా ఉంటాయన్నారు. ఒకటో నుంచి ఏడో తరగతి వరకు ఇంగ్లీష్ మీడియం కూడా ఉన్నదన్నారు. నేడు ప్రయి వేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి కాబట్టి.. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం,స్కూల్ కమిటీ చైర్మెన్ ఉషాన్న పాల్గొన్నారు.

బడిబాటను ప్రారంభించిన ఎమ్మెల్యే





నవతెలంగాణ-మనూర్

ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడిబాట కార్యక్రమాన్ని నారాయణ ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పి.సంజీవ్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగల్గిద్ద మండలం దామర్‌గిద్ద పాఠశాలలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని వారి తల్లిదండ్రులకు సూచించారు. ప్రయివేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతున్నదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే అనుభవం ఉన్న ఉపాధ్యాయులు ఉంటారన్నారు. కాబట్టి ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పండరి, ఉపాధ్యాయలు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన పనులు చేయండి..

మండలంలోని డప్పూరు తాండాపాఠశాలలో నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. పనులు నాణ్యంగా జరగాలని సూచించారు. ఆయన వెంట ఏఈ సంగారెడ్డి, నాయకులు కే దిగంబర్ రెడ్డి, సంగన్న తదితరులు ఉన్నారు.

దామన్న వచ్చే.. నిధులు తెచ్చే

- సింగూరు ఎడమ కాలువకు సీసీ లైన్ ఏర్పాటుకు రూ.168.30 కోట్లు మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న ఆయకట్ట రైతులు

నవతెలంగాణ-పుల్కల్



ఉమ్మడి మెదక్ జిల్లాలోని అతిపెద్దదైన సింగూరు ద్వారా రైతులకు సాగునీరు అందుతున్న విషయం విధితమే. 29.9 టీఎంసీల సామర్థ్యం గల ఈ ప్రాజెక్టు నుంచి ఎడమ కాలువ ద్వారా ఇప్పటికే లక్ష ఎకరాలకు సాగునీరు అందుతున్నది. అప్పట్లో మంత్రి దామోదర్ రాజనర్సింహ సింగూరు నీటి కోసం జోగిపేట పట్టణంలో 102 రోజులపాటు నిరా హార దీక్ష చేసిన విషయం విధితమే. నాడు కాంగ్రెస్ ప్రభుత్వంలోనే సింగూరు ఎడమ కాలువ తవ్వకాలను ప్రారంభించి.. ఆ కాలువ ద్వారా రైతులకు 40 వేల ఎకరాలకు సాగునీరు విడుదల చేశారు.

అయితే రాష్ట్రంలో ఇటీవలే కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ అందికారంలోకి రావడంతో.. సింగూరు ఎడమ కాలువ సీసీ లైనింగ్ ఏర్పాటు కోసం మంత్రి దామోదర్ రాజనర్సింహ ఎంతగానో శ్రమించి రూ.168.30 కోట్లను మంజూరు చేయించారు. దాంతో స్థానిక నాయకులు, రైతులు ఈ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పుల్కల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి మండల అధ్యక్షులు దుర్గారెడ్డి, సత్తి దశరథ్‌లు శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ.. గత పదేండ్లుగా పాలించిన పాలకులు చేయలేని అభివృద్ధి పనులు కేవలం తమ కాంగ్రెస్ పార్టీ గెలిచిన ఆరు నెలల్లోపే చేసిందన్నారు. ఇంత భారీ మొత్తంలో సింగూరు ప్రాజెక్టు ఎడమ కాలువకు నిధులు కేటాయించడం హర్షించ దగ్గ విషయమన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, గోవర్ధన్,అంజయ్య, మాణిక్యం, మాజీ సర్పంచ్ పడమటి యాదగిరి, పుల్కల్ గ్రామాధ్యక్షులు మన్నే విట్టల్, ఉపాధ్యక్షులు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' రక్షణకు రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

నవతెలంగాణ-కొండాపూర్



ఉపాధి హామీ రక్షణ కోసం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రేపు(సోమవారం) జరగనున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నర్సిములు పిలుపునిచ్చారు. మండలంలోని సిహెచ్ కొనాపూర్ గ్రామాల్లో శనివారం రాష్ట్ర సదస్సు కరపత్రాలు విడుదల చేసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నర్సిములు మాట్లాడుతూ.. ఉపాధి హామీ రక్షణకు జరిగే రాష్ట్ర సదస్సులో ముఖ్య అతిథులుగా గ్రామీణ అభివృద్ధి పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, రాజ్యసభ సభ్యులు (ఎంపీ) శివదాసన్, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి. నాగయ్య, ఆర్. వెంకటరాములు హాజరవుతారన్నారు. వ్యవసాయ కార్మిక సంఘాల పోరాట ఫలితంగా పార్లమెంటులో యూపీఏ 1 ప్రభుత్వానికి వామపక్షాల మద్దతు ఇవ్వడం ద్వారా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 100 రోజుల పని గ్యారెంటీ చేస్తూ చట్టం చేయడం జరిగిందన్నారు. దీనిని తెచ్చిన ఘనత వామపక్షాలది, వ్యవసాయ కార్మిక సంఘాలదన్నారు. రాష్ట్రంలో 54 లక్షల జాబ్ కార్డులలో కోటి 20 లక్షల హామీని పటిష్టంగా అమలు చేయడం కోసం పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. సంగారెడ్డి జిల్లాలో రెండున్నర లక్షల జాబు కార్డుల లో 4.50 లక్షల మంది కూలీలు పేర్లు నమోదు చేసుకున్నారని, డిమాండ్‌కు అనుగుణంగా కూలీలందరికి పనికల్పించడం లేదన్నారు. ఉపాధి కూలీల సమస్యలు పరిష్క రించాలన్నారు రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాం డ్ చేశారు. శ్రమకు తగ్గ ఫలితం రావడంలేదని,ఫీల్డ్ అసిస్టెంట్లను రెగ్యులరై జేషన్ చేయాలని కోరారు. ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు సరి అయిన వేతనాలు రాకపోవడం దారుణమన్నారు. ఉపాధి పని ప్రదేశాలలో టెంట్లు, మంచినీరు సౌకర్యాలు ఉండాలని చట్టంలో చెబుతున్న అవి అమలు జరగకపోవడం అన్యాయమన్నారు. ఈ రాష్ట్ర సదస్సు కు ఉపాధి కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఈజీఎస్ సిబ్బంది మెట్టు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలఅన్నారు. ఈ కార్యక్రమంలో ఈడికి అబ్బాస్ మంగలి సత్తయ్య సామెల్ ఆంజనేయులు. శ్రీశైలం, నీటి లక్ష్మయ్య, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

నర్సింలు మృతికి కారణమైన నిందితులందరినీ శిక్షించాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

కోహిర్ మండలం బడంపేట గ్రామానికి చెందిన బేగరి నర్సింలు మృతికి కారణమైన గ్రామానికి చెందిన అగ్రకుల పెత్తందారులందరిని వెంటనే అరెస్టు చేసి నర్సింలు కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరుతూ సంగారెడ్డి సుందరయ్య భవన్‌లో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఆధ్వర్యంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పి.అశోక్, అల్ ఇండియా అంబెద్కర్ సంఘం జిల్లా సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పి. దుర్గాప్రసాద్, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఇమ్మయ్య, సీనియర్ దళిత నాయకులు నాగరాజు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాజయ్య, సీనియర్ న్యాయవాది రామా టావు లు మాట్లాడుతూ.. రోజురోజుకు దళితులపై వివక్ష దాడులు జరుగుతున్నాయన్నారు. కొడుకు అగ్రకుల అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడని బేగరి నర్సింలును కొట్టి చంపడం దుర్మార్గమన్నారు. ఇది ముమ్మాటికీ కుల దురహంకార హత్యే అన్నారు. మృతికి కారణమైన తొమ్మిది మంది పేర్లను కుటుంబ సభ్యులు రాత పూర్వకంగా ఇస్తే ముగ్గురి పేర్లు మాత్రమే ఎఫ్ఐఆర్‌లో చేర్చి రిమాండ్‌కు పంపారని.. మిగిలిన ఆరుగురిని ఎందుకు అరెస్టు చేయలేదో పోలీసులు సమాధానం చెప్పాలన్నారు. కొంత మంది నిందితులకు కొమ్ముకాసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మిగతా వారిని అరెస్టు చేసి చిత్తశుద్ధి ప్రజల్లో నమ్మకాన్ని నిలబెట్టుకోవాలన్నారు. కేసును నిరుగారుగారుస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. వెంటనే గ్రామంలో ఉన్నతాధికారులు పర్యటించి బాధితులకు భరోసా ఇవ్వాలన్నారు. బాధితుడి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా, 5 ఎకరాల భూమి, ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మృతుని కుటుంబనికి న్యాయం జరిగే వరకు పోరాడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా నాయకులు ప్రభాకర్, దత్తు, సుదర్శన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
ఆదివారం | 09 జూన్ 2024 | www.navatelangana.com

మల్లన్న జాతరలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-నార్సింగి

మండల కేంద్రంలో ప్రతి ఏడాది మృగశిర కార్తె నాడు పీనుగుల మల్లన్న జాతరను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తారు. శనివారం మృగశిర కార్తె సందర్భంగా అంగరంగ వైభవంగా నిర్వహించిన మల్లన్న జాతరలో నార్సింగి జెడ్పీటీసీ బానాపురం కృష్ణా రెడ్డి, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మైలారం బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మల్లన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఏడు వర్షాలు బాగా కురవాలని, పంటలు బాగా పండాలని, సమస్త జనాలు సుఖ సంతోషాలతో, సిరి సంపదలతో వర్ధిల్లాలని మల్లన్నను కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఉప సర్పంచ్ కాలేరు యోగి, యాదగిరి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో గర్భవతులకు టీకాలు



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని నగరం గ్రామపంచాయతీలోని అంగన్వాడి కేంద్రంలో ఏఎన్ఎం నిర్మల గర్భవతులకు, 6 సంవత్సరాల లోపల వయసు కలిగిన విద్యార్థులకు ఇంజక్షన్లు ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్మల మాట్లాడుతూ గర్భవతులు ఆకుకూరలు పౌష్టికమైన ఆహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ స్వప్న అంగన్వాడీ టీచర్ గుగులోతు స్వప్న తదితరులు పాల్గొన్నారు.

సింగూరు నీళ్లు గుండు వాగులో కలపాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లేశం



నవతెలంగాణ-టేక్మాల్

సింగూరు ప్రాజెక్టు నీరును టేక్మాల్ మండలంలోని గుండువవాగులో కలిపి అల్లాదుర్గం, టేక్మాల్, పాపన్నపేట్ మండలాలకు సాగు నీరు అందివ్వాలని సీపీఐ(ఎం) పార్టీ మెదక్ జిల్లా కార్యదర్శి మల్లేశం డిమాండ్ చేశారు. శనివారం టేక్మాల్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. 2017 సంవత్సరంలో ఈ ప్రాంతంలో సింగూరు నీటిని కలపాలని సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలో ఉద్యమం చేశామని గుర్తుచేశారు. టేక్మాల్, అల్లాదుర్గం, పాపన్నపేట్ , మండలాల ప్రజలు ఏం పాపం చేశారని వారు గుర్తు చేశారు. సుమారు నాలుగు లక్షల ఎకరాలకు నీరు అందించే విధంగా ఈ గుండు వాగు ప్రాజెక్ట్ ఉందని గుర్తు చేశారు. మూడు మండలాల్లోని రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ కల్పించుకొని గుండువాగుకు నీళ్ల అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజలను కదిలించి ప్రత్యక్ష ఉద్యమం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే మల్లేశం, జిల్లా కమిటీ సభ్యులు సంతోష్, టేక్మాల్ మండల నాయకులు, విజయ్, కరుణాకర్, అరుణ్, అశోక్‌లు ఉన్నారు.

అంధకారంలో నిజాంపేట మండల కేంద్రం

- స్పందించని అధికారులు
- మండల కేంద్రంలో వీధిలైట్లు వేయాలని వేడుకోలు



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రం పూర్తిగా అంధకారంలో మగ్గుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామ పంచాయితీ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు. నేషనల్ హైవే రోడ్డుపై వీధిలైట్లు లేకపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, అయినా కూడా అధికారులు స్పందించడం లేదని గ్రామస్తులు వాపోయారు. గ్రామంలో వీధిలైట్లు లేకపోవడంతో పాములు తేళ్ల విషసర్పాలు వచ్చి కాటేసే ప్రమాదం ఉందని పలువురు తెలిపారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని సంబంధిత జిల్లా అధికారులు వెంటనే స్పందించి మండల కేంద్రంలో వీధిలైట్లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించిన తిరుపతిరెడ్డి



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలో శనివారం బీఆర్ఎఎస్ పార్టీ సీనియర్ నాయకులు దాత్రిక సదాశివలింగం తల్లి సత్తవ్వ (80) అనారోగ్యంతో మరణించారు. ఆమె నిజాంపేట గ్రామపంచాయతీ వార్డు మెంబర్‌గా నిజాంపేట గ్రామస్తులకు సేవలందించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠరెడ్డి తిరుపతి రెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ పట్టణ అధ్యక్షులు నాగరాజు, యూత్ అధ్యక్షులు మావురం రాజు, మండల వైస్ ప్రెసిడెంట్ లచ్చపేట రాములు గౌడ్, మాజీ ఎంపిటిసి చింతల స్వామి, నిజాంపేట మాజీ ఎంపీటీసీ పున్న వెంకటస్వామి, అందే మాధవరెడ్డి, కంఠరెడ్డి కొండల్ రెడ్డి, రామచంద్ర రెడ్డి, రంగ నర్సింలు, బిక్షపతి రెడ్డి, రెడ్డి శెట్టి రవీందర్ పాల్గొన్నారు.

ప్రతి కాంగ్రెస్ కార్యకర్తను కాపాడుకుంటాం

- మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు



నవతెలంగాణ-హవేలీ ఘనపూర్

ఆపదలో ఉన్న ప్రతి కాంగ్రెస్ కార్యకర్తను కాపాడుకుంటామని, ఆ కుటుంబానికి అండగా ఉంటానని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. శనివారం మెదక్ నియోజకవర్గంలోని హవేలీ ఘనపూర్ మండలం గాజిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కాయితీ సతీష్ ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాంగ్రెస్ కార్యకర్త సతీష్‌ను మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పరామర్శించి అతని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ కార్యకర్త సతీష్‌కు మెరుగైన వైద్య సహాయం అందించాలని డాక్టర్లకు సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాలకిషన్ రావు, పవన్ పరశురాం గౌడ్, మాజీ సర్పంచ్ అక్బర్, చిట్యాల శ్రీనివాస్, సాప చిన్న సాయిలు బాల పోచయ్య సాయిబాబా, మహేందర్, లడ్డు సంగమేశ్వర్, రాజయ్య, తదితరులు ఉన్నారు.

రేపు ఇంటర్మీడియట్ ఇంగ్లీష్ ప్రాక్టీకల్స్

- ఇంటర్మీడియట్ విద్యాధికారి సత్యనారాయణ



నవతెలంగాణ- మెదక్

ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు కొనసాగింపుగా సోమవారం ఉదయం 9 నుంచి ఇంగ్లీష్ ప్రాక్టీకల్స్ ప్రారంభం కానుందని ఇంటర్మీడియట్ విద్యాధికారి సత్యనారాయణ తెలిపారు. గత వార్షిక పరీక్షలో ప్రథమ సంవత్సరం ఇంగ్లీష్ ప్రాక్టికల్స్‌లో అనుత్తీర్ణులైన విద్యార్థులు, హాజరుకాని విద్యార్థులు తమ కళాశాలలో తప్పని సరిగా హాజరుకావాలని ఆయన తెలిపారు. 10వ తేది ఇంగ్లీష్ ప్రాక్టీకల్స్‌తో పాటుగా 11వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పర్యావరణ విద్య, 12 తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నైతికత, మానవ విలువలపై పరీక్షలు జరుగుతాయన్నారు. ఫై ఏదేని పరీక్షలో అనుతీర్ణులైతే ఆయా విద్యార్థులు అనుతీర్ణులుగా పరిగణిస్తారన్నారు. ఇంటర్మీడియట్ పాస్ సర్టిఫికెట్‌ను ఇంటర్మీడియట్ బోర్డు జారీ చేయదన్నారు. కావున విద్యార్థులు వారి తల్లి తండ్రులు ఈ విషయాన్ని గమనించి తప్పని సరిగా హాజరు కావాలని తెలిపారు. జిల్లాలో ఉన్న ఇంటర్మీడియట్ కళాశాలల ప్రిన్సిపల్స్ అందరు పరీక్షా తేదీల సమాచారాన్ని ఆయా విద్యార్థులకు చేరవేసి గతంలో హాజరుకాని,అనుత్తీర్ణులైన విద్యార్థులు పరీక్ష వ్రాసే విధంగా చూడాలని సూచించారు.

నేడు మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు పర్యటన

నవతెలంగాణ-నంగునూరు

మండలంలోని అక్కెనపల్లి గ్రామంలో మాజీ మంత్రి హరీశ్‌రావు ఆదివారం పర్యటించనున్నారని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఆనగోని లింగం గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల సోమిరెడ్డి తెలియజేశారు. రైతు తిప్పని నాగేంద్రం ఆయిల్ ఫామ్ తోటలో గెలలు తెంపే కార్యక్రమంలో మాజీ మంత్రి హరీశ్‌రావు పాల్గొంటారని వారు తెలిపారు. ఆదివారం ఉదయం 11.00లకు అక్కెనపల్లి గ్రామ రైతు తిప్పని నాగేంద్రం ఆయిల్ ఫామ్ తోటలోని తొలి గెలలు తీసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, విద్యార్థి నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, మహిళ నాయకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు హాజరు కావాలని వారు కోరారు.

గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలకు పగడ్బందీ ఏర్పాట్లు

- సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్ష హాల్లోకి అనుమతి లేదు
- అభ్యర్థులు పరీక్ష కేంద్రాన్ని ముందే చూసుకోవాలి
- ఉదయం 10 గంటల లోపు పరీక్ష కేంద్రంలోకి చేరుకోవాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్





నవతెలంగాణ-మెదక్

ఈ నెల 9న జరిగే గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలు సజావుగా, నిష్పక్షపాతంగా జరిగేలా అంకితభావంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. శనివారం మెదక్ మండలం మంబోజిపల్లి గ్రామంలోని గీతా హై స్కూల్, మెదక్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన గ్రూప్ -01 ప్రిలిమ్స్ టెస్ట్ పరీక్ష కేంద్రాలను సందర్శించారు. పరీక్ష పగడ్బందీగా నిర్వహణపై ఇన్విజిలేటర్స్‌కు అవగాహన సదస్సు కార్యక్రమంలో పరీక్షల సమర్థ నిర్వహణకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రూప్ -01 పరీక్షలలో ఎలాంటి పొరపాట్లు జరగకుండ కేటాయించిన విధులను నిబద్ధతతో నిర్వర్తించాలన్నారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు కొనసాగే గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు జిల్లా నుంచి హాజరవుతున్న 3,912 మంది అభ్యర్థుల కొరకు 10 కేంద్రాలలో కనీస సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. డిపార్ట్మెంటల్ అధికారులు, పర్యవేక్షకులు, రూట్ ఆఫిసర్లను నియమించినట్లు తెలిపారు. కేవలం చీఫ్ సూపరింటెండెంట్ మినహా ఎవరూ పరీక్ష కేంద్రంలోకి మొబైల్ ఫోన్ తీసుకెళ్లవద్దని స్పష్టం చేశారు. ప్రతి కేంద్రంలో మహిళలు, పురుషులకు వేరువేరుగా తనిఖీ గదులు ఏర్పాటు చేయాలని సూచించారు. 9వ తేదీ ఉదయం 10 గంటల లోపు అభ్యర్థులు పరీక్ష హాల్లోకి చేరుకోవాలని, సమయపాలనలో ఎలాంటి మినహాయింపు లేదని చెప్పారు. బయోమెట్రిక్ హాజరు నమోదు (ఆఫ్ లైన్) ద్వారా ఉదయం 9:30 గంటలకు మొదలు కాబోతుందని వివరించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో టీజీపీఎస్సీ గ్రూప్-1 పరీక్ష పేపర్లు ఓపెన్ చేయాలని చెప్పారు, మొబైల్ ఫోన్స్ ఎలక్ట్రానిక్ ఐటమ్స్ ఎట్టి పరిస్థితుల్లో అనుమతించవద్దని సూచించారు. పరీక్ష పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ విధిస్తున్నామని, పరీక్షా కేంద్రంలో చీఫ్ సూపర్డెంట్ అబ్జర్వర్, ఇన్విజిలేటర్, బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు, ఆశా ఏఎన్ఎం, సెల్ఫోన్ స్టోరేజ్ స్టాఫ్ తప్ప మరి ఇతర వ్యక్తులు పరీక్ష పరిసర ప్రాంతాల్లో ఉండకూడదని తెలియజేశారు.

అభ్యర్థులకు సూచనలు

పరీక్ష సమయానికి గంటన్నర ముందు నుంచే అభ్యర్థులను హాల్లోకి అనుమతిస్తారని తెలిపారు. పరీక్షకు అరగంట ముందే గేట్లు మూసివేస్తారని, అభ్యర్థులు కేవలం చెప్పులు ధరించాలని, బూట్లు వేసుకుని రాకూడదన్నారు.

బయోమెట్రిక్ తప్పనిసరి

పరీక్ష కేంద్రంలో ప్రవేశించిన అభ్యర్థి నుంచి బయోమెట్రిక్ వేలిముద్రలు సేకరిస్తారన్నారు. ఒకవేళ బయోమెట్రిక్ ఇవ్వకుంటే సదరు అభ్యర్థి జవాబు పత్రం మూల్యాంకనం చేయబోమని కమిషన్ స్పష్టం చేసిందని వివరించారు. బయోమెట్రిక్ పూర్తయ్యేవరకు అభ్యర్థులెవరూ పరీక్ష కేంద్రం నుంచి బయటకు వెళ్లడానికి వీల్లేదని అభ్యర్థుల సౌకర్యార్థం అరగంటకు ఒక్కసారి బెల్ మోగించి పరీక్ష సమయాన్ని తెలియజేస్తారన్నారు. అవసరమైతే ఇన్విజిలేటర్లను అడిగి సమయం తెలుసుకోవచ్చని తెలిపారు. ప్రింటెడ్ హాల్ టిక్కెట్లో అభ్యర్థి ఫోటోగ్రాఫ్, సంతకం స్పష్టంగా ఉన్నప్పుడే అది చెల్లుబాటు అవుతుందని, కాబట్టి లేజర్ ప్రింటర్తో లేదా కలర్ ప్రింటర్తో ఏ4 సైజు కాగితంపై ముద్రించిన హాల్ టిక్కెట్‌ను తీసుకోవాలని, పరీక్షా కేంద్రానికి వచ్చే ముందు ప్రింటెడ్ హాల్ టికెట్లోని నిర్దేశిత స్థలంలో అభ్యర్థి పాస్పోర్ట్ సైజ్ ఫోటోను అతికించాల్సి ఉంటుందన్నారు. లేనిపక్షంలో అనుమతించరని చెప్పారు. ఒకవేళ డౌన్లోడ్ చేసిన హాల్ టిక్కెట్లో అస్పష్టమైన ఫోటో ఉన్నట్లయితే, అభ్యర్థి మూడు (3) పాస్పోర్ట్ సైజు ఫోటోలను విధిగా అండర్ టేకింగ్తో పాటు చివరిగా చదువుకున్న విద్యా సంస్థ గెజిటెడ్ అధికారి, ప్రిన్సిపాల్ చేత ధ్రువీకరణతో తీసుకురావాలి లేకుంటే పరీక్షా కేంద్రంలోకి అనుమతించరని చెప్పారు. అభ్యర్థులు పరీక్ష ముగిసేవరకు పరీక్ష కేంద్రాన్ని విడిచి వెళ్లకూడదు పరీక్ష ముగిసిన తరువాత ఓఎంఆర్ పత్రాన్ని ఇన్విజిలేటర్కు అప్పగించాలని తెలిపారు. హాల్ టికెట్‌పై ముద్రించిన సూచనల కాపీని కూడా కమిషన్ ఇప్పటికే వెబ్సైట్లో అందుబాటులో ఉంచిందని సూచనలు జాగ్రత్తగా చదివి పరీక్ష సమయంలో వాటిని పాటించాలన్నారు. అభ్యర్థులు పొరపాట్లు చేసినా, ఓఎంఆర్, హాల్ టికెట్లలోని నిబంధనలు పాటించకున్నా. కమిషన్ ఎలాంటి బాధ్యత వహించదని తెలిపారు. ఈ సమావేశంలో టీజీపిఎస్సి అబ్జర్వర్ రోహిత్ కుమార్, రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ కే హుస్సేన్, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ సంబంధిత ఇన్విజిలేటర్లు పాల్గొన్నారు.

శనివారం కార్తె రావడంతో తగ్గిన చేపల విక్రయాలు



నవతెలంగాణ-నార్సింగి

సూర్యుడు ఒక్కో నక్షత్రంలోకి ప్రవేశించే దానిని బట్టి ఆ నక్షత్రం పేరుతో కార్తెలు ఏర్పడతాయి. మృగశిర కార్తె మొదటి రోజును దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో మృగశిర, మృగం, మిరుగు, మిర్గం అనే పేర్లతో పిలుస్తారు. మృగశిర కార్తె ప్రారంభంతో వేసవి తీవ్రత తగ్గుముఖం పట్టి తొలకరి జల్లులు ప్రారంభం అవుతాయి. మృగశిర రాగానే రైతులు ఏరువాకకు సిద్ధ మవుతుంటారు. నైరుతి ప్రవేశంతో తొలకరి జల్లులు కురుస్తుంటాయి. దీంతో పొలాలు దున్ని పంటలు వేయటం ప్రారంభిస్తుంటారు. ఇక మృగశిర కార్తె అనగానే చేపలు గుర్తొస్తాయి. మాంసాహారం తినే వారు కార్తె తొలి రోజు చేపలు, చికెన్, శాకాహారులు ఇంగువ బెల్లం పుచ్చుకోవడం ఆనవాయితీ. దీనికి కారణం కూడా లేక పోలేదు. ఎండాకాలం తర్వాత వాతావరణం చల్లబడటంతో మన శరీరంలో ఉష్ణోగ్రత తగ్గుతుంది. దీంతో శరీర ఉష్ణ సమతుల్యత కొరకు చేపలు, కోడి మాంసం, ఇంగువ బెల్లంను తింటారు. మరోవైపు కార్తె రాకతో వర్షాలు పడుతుంటాయి. వర్షాల వల్ల కొన్ని సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడం వల్ల, రోగ నిరోధక శక్తి పెంచుకోవడానికి, వ్యాధుల నుంచి రక్షణ కొరకు చేపలు తింటారని అంటారు. తొలిరోజు రోజు చేపలకు ఫుల్ గిరాకీ ఉంటు ంది. ప్రతి పల్లెలోని చెరువుల వద్ద, అంగడులలో చేపలు కొనేవారితో సందడిగా ఉంటుంది. నార్సింగి పట్టణ కేంద్రం లోనూ ప్రతి ఏడు మృగశిర కార్తె నాడు మండల వ్యాప్త గ్రామాల నుంచి మృగశిర రోజు చేపలు కొనడానికి భారీగా జనాలు వస్తారు. ఎటు చూసినా చేపల, మాంసాహార ప్రియులతో సందడిగా ఉంటుంది. కానీ, ఈ ఏడాది మృగశిర కార్తె శనివారం రావడంతో చేపల వ్యాపారం అనుకున్నం తగా సాగలేదని వర్తకులు అన్నారు. ప్రతి సంవత్సరం నార్సింగిలో వ్యాపారం భారీగా జరిగేదని, ఈ ఏడాది కూడా వ్యాపారం బాగా ఉంటుందని ఆశతో చేపలను భారీగా తరలించినా శనివారం అవడం వల్ల అమ్మకాలు ఆశించిన స్థాయిలో కాకుండా తక్కువగా జరిగాయని విక్రేతలు పేర్కొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కృష్ణ గౌడ్



నవతెలంగాణ-రాయపోల్ : భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన చుంచనకోట కృష్ణ గౌడ్‌ను నియమిస్తున్నట్లు భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బాలయ్య ప్రకటించారు. శనివారం రాష్ట్ర కార్యాలయంలో నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ గౌడ్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా తనపై నమ్మకంతో బాధ్యతలు ఇచ్చినందుకు సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బాలయ్యకు, తన ఎన్నికకు సహకరించిన సంఘం నాయకులు, కార్మికులకు కృతజ్ఞతలు తెలియజేశారు. భవన నిర్మాణ కార్మికులను సంఘటితం చేసి కార్మికుల హక్కుల కోసం ముందుండి పోరాడతామన్నారు. నింగిని తాకే అతి పెద్ద భవనాలు నిర్మించే కార్మికులకు కనీసం నివాసం ఉండడానికి పిట్ట గూడులాంటి ఇల్లు కూడా ఉండదన్నారు. నిత్యావసర ధరలు పెట్రోల్ డీజిల్ గ్యాస్ వంటివి అధిక రేట్లు కావడంతో కార్మికులు కష్టనష్టాలను ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వాల నుంచి రావలసిన సౌకర్యాలు వసతులు కార్మికులకు దక్కే విధంగా కృషి చేస్తానని పేర్కొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించేది ఎప్పుడు

- మైలారం బాబు



నవతెలంగాణ-నార్సింగి

వానాకాలం నుంచి రైతు భరోసాను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఆ దిశగా ఎలాంటి కార్యాచరణ ప్రారంభించ లేదని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మైలారం బాబు విమర్శించారు. పట్టణ కేంద్రంలో శనివారం బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో గెలవడానికి బూటకపు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని మండి పడ్డారు. ఎన్నికలలో ఇచ్చిన హామీకి విరుద్ధంగా ఇప్పుడు రైతు బంధు నిభందనలు మారుస్తామని, సాగు చేసిన భూములకు మాత్రమే ఇస్తామని, దానిపై అసెంబ్లీలో చర్చించి నిర్ణయ తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బూటకపు మాటలతో కాలయాపన చేస్తున్నారన్నారు. అసెంబ్లీ సమావేశాలు ఎప్పుడు జరుపుతారని, రైతు బంధుపై ఎప్పుడు చర్చలు జరుపుతారని, నిబంధనలు ఖరారు చేయడం ఎప్పుడు జరుగుతుందని, రైతులకు పెట్టుబడి సాయం ఎప్పుడు అందిస్తారని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ హయాంలో ఎన్నడూ రైతు బంధు ఆలస్యంగా వేయడం జరగలేదని, రైతులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించారని, రైతు బాంధవుడైన కెసిఆర్ హయాంలో రైతులు సుఖసంతోషాలతో, సిరిసంపదలతో రాజులా జీవించే వారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు గడ్డు కాలం వచ్చిందని, ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వం అని, పెట్టుబడి సాయం ఇప్పట్లో అందించేలా కనబడడం లేదన్నారు. రైతులకు, కౌలు రైతులకు వెంటనే పెట్టుబడి సాయం అందించాలని, రైతులకు వ్యవసాయం కొరకు నాణ్యమైన 24 గంటల ఉచిత విద్యుత్తు, సాగు నీరు, విత్తనాలు, ఎరువులు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మైలారం బాబు డిమాండ్ చేశారు.

ఆలయ భూములు కాపాడలేని అసమర్థుడు మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి

- ఆలయ చైర్మన్ పదవిని అమ్మిన కొమ్మూరి
- పదవితోలక్ష్మారెడ్డి కోట్ల రూపాయల దోపిడీ
- సీపీఐ(ఎం)ను విమర్శించే స్థాయి మీకు లేదు
- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి



నవతెలంగాణ - కొమురవెల్లి

మల్లన్న ఆలయ భూములు కాపాడలేని అసమర్థుడు టెంపుల్ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డికి సీపీఐ(ఎం)ను విమర్శించే స్థాయి లేదని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి అన్నారు శనివారం పార్టీ కార్యాలయంలో రాంసాగర్ మాజీ సర్పంచ్ తాడూరి రవీందర్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం ఆ పార్టీ మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తి రెడ్డి మాట్లాడుతూ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి దగ్గర కొమురవెల్లి మల్లన్న దేవస్థాన చైర్మన్ పదవిని రూ.25 లక్షలకు కొన్న నీవు నీతి నిజాయితీ గురించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. 4 నెలలు పదవిలో ఉండి కొమ్మూరి అండదండలతో కోట్ల రూపాయలు సంపాదించుకున్నాడని, స్వలాభం కోసం ఆలయ భూములు అన్యాక్రాంతమవుతున్నా పట్టించుకోని అసమర్థుడని విమర్శించారు. చేర్యాలలో కొమ్మూరి 13 ఎకరాల వెంచర్‌ను చేసి నిబంధనల ప్రకారం అప్పుడున్న చేర్యాల గ్రామ పంచాయితీకి సుమారు 3 ఎకరాల భూమిని ఇవ్వకుండా మోసం చేశాడన్నారు. ఈ విషయం చేర్యాల ప్రజలందరికి తెలుసన్నారు. వెంటనే ప్రస్తుత మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొమ్మూరి అండతో ఆలయ మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్‌లు కలిసి ఆలయ పరిధిలో ఉన్న ఖరీదైనా భూములను కొల్లగొడుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఆలయ భూములపై విచారణ జరిపి వాళ్ళ చేస్తున్న అవినీతిని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడిగ కృష్ణారెడ్డి, అత్తిని శారద, దాసరి ప్రశాంత్, మండల కమిటీ సభ్యులు తేలు ఇస్తారి, బక్కెలి బాలకిషన్, నరేష్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్జిటీలకు పదోన్నతులు కల్పించడంలో తీవ్ర నష్టం

- ఎస్‌జిటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికల వెంకటేశం



నవతెలంగాణ-వెల్దుర్తి

ఎస్‌టిలకు పదోన్నతులు కల్పించడంలో మల్టీ క్యాడర్ సంఘాలు పట్టించుకోవడంలేదని ఎస్జీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికల వెంకటేశం శనివారం తెలిపారు. భాష పండిత పోస్టులను అప్డేట్ చేస్తూ అర్హత కలిగిన ఎస్జీటీలకు వాటా కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎస్జీటీలో డీఎస్సీ 2000ల సంవత్సరం వారికి పదోన్నతులు రావని భాష పండితులు డీఎస్సీ 2017 సంవత్సరం వరకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందుతారని ఇది అన్యాయమని మల్టీ క్యాడర్ సంఘాలు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో ఎస్జీటీలు పదవి విరమణ పొందుతారని ఇకనైనా మేల్కొని ప్రత్యక్ష పోరాటానికి సిద్ధం కాకపోతే ఎవరు కాపాడలేరన్న నిజాన్ని తెలుసుకొని నిరసనలు, సంఘాలకు రాజీనామాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య



నవతెలంగాణ-పెద్దశంకరంపేట్

కుటుంబ సమస్యలతో జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల కేంద్రమైన పెద్ద శంకరంపేటలో శనివారం చోటు చేసుకుంది. పేట ఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం పెద్ద శంకరంపేటకు చెందిన నాందేడ్ యాదగిరి (31) కుటుంబ సమస్యలతో జీవితంపై విరక్తి చెంది శనివారం ఉదయం తన ఇంట్లోనే దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు వివరించారు. యాదగిరికి భార్య నాందేడ్ ఉష ఇద్దరు కూతుర్లు ఒక కుమారుడు ఉన్నారు యాదగిరి తరచుగా మద్యం సేవించి భార్యతో గొడవ పడే వారన్నారు. నాందేడ్ ఉషతో భర్త రోజు గొడవ పడుతుండడంతో పిల్లలతో కలిసి గత కొన్ని రోజుల క్రితం తన అమ్మవారి ఇంటికి వెళ్ళింది. గత రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులు సముదాయించి భార్యాభర్తలు బాగుండాలని చెప్పడంతో తిరిగి ఇంటికి వచ్చింది. నిన్న రాత్రి తన భర్త మళ్లీ మద్యం సేవించి వచ్చి గొడవ పెట్టుకోవడంతో కుటుంబ సభ్యులు సముదాయించారు. యాదగిరి పడుకుంటానని చెప్పి గదిలోకి వెళ్లి తలుపులు పెట్టుకున్నాడు ఉదయం 7 గంటల వరకు కూడా బయటకు రాకపోవడంతో తలుపులు తీయగా ఉరివేసుకొని మృతి చెందారన్నారు. మృతుడి భార్య నాందేడ్ ఉష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తీన్మార్ మల్లన్న విజయం పట్ల సంబరాలు



నవతెలంగాణ-చేర్యాల

వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపు పట్ల శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేర్యాల పట్టణ కేంద్రంలోని పాత బస్‌స్టాండ్ వద్ద బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్నకు ఓటేసి గెలిపించిన పట్టభద్రులందరికీ పార్టీ పట్టణ అధ్యక్షుడు మంచాల చిరంజీవులు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమురవెల్లి దేవస్థానం కమిటీ మాజీ చైర్మన్ ఆడెపు చంద్రయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పుర్మ ఆగంరెడ్డి, ముస్త్యాల కిష్టయ్య, కౌన్సిలర్లు ఆడెపు నరేందర్, చెవిటి లింగం, నాయకులు దాసరి శ్రీకాంత్, బందెల మహిపాల్ రెడ్డి, తడ్క లింగం, అంబాల రాములు, ఎండీ.ఖజా, మామిడాల నాగరాజు, బుడిగె రమేష్, నాగేంద్ర బాబు, నాగుల వెంకటేశం, అంబటి అంజయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యన్‌సీసీ క్యాంప్‌లో 'రోగ నిరోధకత'పై అవగాహన



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ స్థానిక బాలుర విద్యా సముదాయంలో గత వారం రోజుల నుంచి నిర్వహిస్తున్న సంయుక్త శిక్షణా శిబిరంలో శుక్రవారం వారి శిక్షణతో పాటుగా కేడేట్‌లకు మనుషుల 'రోగ నిరోధకత' పై అతిథి ఉపన్యాసం ఏర్పాటు చేసినట్లు క్యాంప్ కమ్మడన్స్ లెఫ్టినెంట్ కల్నల్ మధుసూదన్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రోగ నిరోధక వ్యవస్థ, రోగ నిరోధకతలో రకాలు, జీవులపై దాని ప్రభావం, రోగ నిరోధక వ్యవస్థ బలపరుచుకోవడానికి చేయాల్సిన పనులు, బలహీనమవడానికి గల కారణాలను సవివరంగా తెలిపారు. అదేవిధంగా మధ్యాహ్నం గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళీ బృందంచే కేడేట్‌లకు కళాశాల ఆడిటోరియంలో ట్రాఫిక్ నిబంధనల అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు యన్‌సీసీ అధికారులు నరోత్తం, సంధ్యారాణిలు తెలిపారు. ఉదయం నిర్వహించిన ఖో-ఖో పోటీలలో డెల్టా కంపెనీ కేడేట్‌లు గెలుపొందినట్లు సుబేధార్ మేజర్ రామ్ హరి తెలిపారు.

ఎంపీ, ఎమ్మెల్సీ విజయానికి కృషి చేసిన వారికి కృతజ్ఞతలు



నవతెలంగాణ-మద్దూరు

భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, వరంగల్, ఖమ్మం, నల్లగొండ, పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికి దూల్మిట్ట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోలా సాయిలు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు. పట్టభద్రులకు. పూర్తి విశ్వాసం ఉందన్నారు. పేద ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని ఆయన తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్సీ, ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు

నిరాశ్రయుల ఆశ్రమంలో అన్నదానం



నవతెలంగాణ-సిద్దిపేట:

వాసవి క్లబ్ వనిత వారి ఆధ్వర్యంలో కొండూరి స్వప్న రవికుమార్ దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా వారి ఆర్థిక సహాయంతో పట్టణ నిరాశ్రయుల ఆశ్రమంలో అన్న దానం నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్షురాలు వాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు వీరేశం తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరంలో బాగాస్వాములవ్వాలి



నవతెలంగాణ-బెజ్జంకి

తిమ్మాపూర్ మండలంలోని ఎల్ఎండీ కాలనీ ప్రజా భవన్‌లో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ జన్మదినం సందర్భంగా ఆదివారం నిర్వహించనున్న రక్తదాన శిబిరంలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో హజరై భాగస్వాములు కావాలని కవ్వంపల్లి యువసేన వ్యవస్థాపకుడు కత్తి రమేశ్ విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే జన్మదినం రోజు కాంగ్రెస్ శ్రేణులు శాలువాలు, పుష్పగుచ్చాలకు స్వస్తి చెప్పి విద్యార్థులకు ఉపయోగపడేలా నోట్ పుస్తకాలు, పెన్నులతో శుభాకాంక్షలు తెలియపర్చవచ్చునని రమేశ్ సూచించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ మండలం ధాతర్ పల్లి లో గత వారం జోగు లచయ్య అనారోగ్యం తో చనిపోవడం జరిగింది. వారి ఆర్థిక పరిస్థితిని చూసి వారి కుమారు లు అయినా జోగు యాదయ్య, జోగు మల్లేశం (పారిశుధ్య కార్మికుడు) కి 3500 రూపాయల నగదు,30 కేజీల బియ్యం సహాయం చెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఉప సర్పంచ్ తలారి స్వామి, మండల బీజేపీ ఉప అధ్యక్షుడు బారు అరవింద్, బూత్ అధ్యక్షుడు బాసు రాజు, మండల ప్రెసిడెంట్ జూపల్లి సాయి కిరణ్, గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.. సాహయం చేసిన చేతులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీని కలిసిన మాజీ జెడ్పిటిసి



నవతెలంగాణ-చేర్యాల

భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డిని చేర్యాల మాజీ జెడ్పిటిసి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కొమ్ము నర్సింగరావు ఆయన సతీమణి మాజీ ఎంపీటీసీ కొమ్ము రాజేశ్వరి శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా కొమ్ము నర్సింగరావు మాట్లాడుతూ చేర్యాల మండల పరిధిలోని చాలా గ్రామాలకు ఒక గ్రామం నుంచి మరొక గ్రామానికి అనుసంధానమైన రోడ్లను పిఎంజియస్‌వై కింద మంజూరు చేయాలని ఎంపీని కోరినట్లు తెలిపారు. దీనిపై ఎంపీ సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ -నంగునూరు

నంగునూరు మండలం రాజగోపాల్ పేట గ్రామానికి చెందిన జాజాల పోచవ్వ శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. పేద కుటుంబ పరిస్థితి గురించి కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు రంగు అశోక్ గౌడ్ ఫోన్‌లో కాంగ్రెస్ నాయకులు చక్రధర్ గౌడ్‌కు తెలిపారు. వెంటనే స్పందించిన చక్రధర్ గౌడ్ దహన సంస్కారాల కోసం రూ. 10 వేలను పంపించారు. వాటిని మృతురాలి కుటుంబానికి అందజేశారు. కాంగ్రెస్ నాయకులు శివ, కాటం కనకయ్య, భద్రయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలంలో నేడు పాలమాకుల 132 కేవీ సబ్ స్టేషన్‌లో మెయింటెనెన్స్ పనులు ఉన్నందున త్రి ఫేజ్ కరెంట్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీఈ సుధాకర్ రెడ్డి తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉదయం 09:00 గంటల నుంచి మధ్యాహ్నం 01:00 గంటల వరకు వ్యవసాయానికి విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. సింగిల్ ఫేస్ విద్యుత్ మాత్రమే ఇవ్వబడగా, త్రీ ఫేస్ విద్యుత్ సరఫర నిలిపివేస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ అంతరాయం ఏర్పడినందుకు నంగునూరు మండల ప్రజలు, రైతులు సహకరించాలని కోరారు.

ఆరు గ్యారంటీలో వెంటనే అమలు చేయాలి

బీజేవైఎం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నీలం దినేష్



నవ తెలంగాణ-సిద్దిపేట

రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగిసినందున కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీలు వెంటనే అమలు చేయాలని బీజేవైఎం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నీలం దినేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిచేందుకు తొలి కేబినెట్ సమావేశంలోనే హామీలన్నీ అమలు చేస్తామన్న కాంగ్రెస్, అధికారంలోకి వచ్చాక ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని మండిపడ్డారు. గ్యారంటీలంటూ గారడీ మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటల సీజన్ ప్రారంభమైనా విత్తనాలు దొరకక రైతులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ ఇంకా ఎప్పుడు చేస్తారని ప్రశ్నించారు. అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ అమలుకాని హామీలు ఇచ్చిందని దుయ్యబట్టారు. హామీల అమలుకు ఎంత డబ్బు కావాలి, ఎలా సమీకరించానే విషయాలపై కాంగ్రెస్ సర్కారుకు కనీస స్పష్టత కూడా లేదని విమర్శించారు. ప్రజాగ్రహానికి గురికాకముందే ఇచ్చిన హామీ మేరకు గ్యారెంటీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

- 21 పరీక్ష కేంద్రాలలో పరీక్ష రాయనున్న 8,223 మంది అభ్యర్థులు
- ఒక నిమిషం ఆలస్యం నిబంధన అమలు
- 298 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు



నవతెలంగాణ-సిద్దిపేట

గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షకు ఏర్పాట్లను జిల్లా అధికారులు పూర్తి చేశారు. సిద్దిపేట పట్టణంలో ఏర్పాటు చేసిన 21 పరీక్ష కేంద్రాలలో 8,223 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్ష రాసే అభ్యర్థులకు అన్ని రకాల సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ఎక్కడ కూడా అవాంఛనీయ సంఘటన జరగకుండా పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ ను అమలు చేస్తూ, 298 మంది పోలీస్ సిబ్బందితో గట్టి బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు.

9 గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతి

ఐడెంటిఫికేషన్ అధికారులు పరీక్ష కేంద్రాల్లోకివచ్చే అభ్యర్థుల హాల్ టికెట్ పరిశీలించి లోపలికి పంపించనున్నారు. పరీక్ష రాసే అభ్యర్థులను ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు మెయిన్ గేట్ వద్ద, పరీక్ష హాల్ వద్ద క్షుణ్ణంగా తనిఖీ చేసి అధికారులు లోపలికి పంపించనున్నారు. పురుష, మహిళా అభ్యర్థులను వేర్వేరుగా మహిళా, పురుష సిబ్బంది తనిఖీ చేయాలని అధికారులు ఆదేశించారు. బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు ఉదయం 9:30 గంటల నుంచి పరీక్ష రాసే అభ్యర్థుల వేలిముద్రను బయోమెట్రిక్ ద్వారా రికార్డు చేస్తారు. జిల్లాలో మొత్తం 8223 మంది పరీక్ష రాయనుండగా వారిలో 13 మంది అంద దివ్యాంగ అభ్యర్థులు ఉన్నారు, వారికి ఇంటర్మీడియట్ వరకు మాత్రమే చదివిన వారిని సహాయకులుగా నియమించి పరీక్ష రాయించనున్నారు. పరీక్ష సమయం పూర్తయ్యేలోగా పరీక్ష కేంద్రం నుంచి ఎవరు బయటకు వెళ్లడానికి వీలులేదని, పరీక్ష హాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరాదని సిబ్బందికి అధికారులు సూచించారు. పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటు, పరీక్ష కేంద్రంలో రక్షణ ఏర్పాట్లు, విద్యుత్తు, మరుగుదొడ్లు, ఫర్నిచర్, త్రాగునీరు తదితర ఏర్పాట్లను పూర్తి చేశారు. ఒక నిమిషం నిబంధన అమలులో ఉన్నందున 10 గంటల వరకు అభ్యర్థులందరూ పరీక్షా కేంద్రాల్లోకి చేరుకోవాలని అధికారులు కోరుతున్నారు.

పరీక్షా కేంద్రాల చుట్టూ 360 డిగ్రీ ఆవరణలో పటిష్టమైన బందోబస్తు

పరీక్షా కేంద్రాల చుట్టూ 360 డిగ్రీ ఆవరణలో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేసి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా పోలీసులు చర్యలు చేపట్టారు. కేంద్రాల వద్ద సిఆర్పిసి 144 సెక్షన్ ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అమలు చేస్తున్నారు. అడిషనల్ డీసీపీలు ఇద్దరూ, ఏసీపీలు నలుగురు, 14 మంది సీఐలు, 21 మంది ఎస్ఐలు, 257 మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, మహిళా కానిస్టేబుళ్లు, హెూంగార్డులు విధులు నిర్వహించనున్నారు.

ప్రజ్ఞాపూర్, గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాల, తదితర ప్రాంతాల్లో ప్రత్యేకమైన బస్సులు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రంలోకి బ్యాగులు, సెల్ ఫోన్లు, స్మార్ట్ ఫోన్లు, వాచ్లు, క్యాలిక్యులేటర్ తదితర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించరు. అభ్యర్థులు తమ హాల్ టికెట్‌పై పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో అంటించుకొని రావాలని అధికారులు సూచించారు.

పరీక్ష కేంద్రాలు

ఇందూర్ ఇంజనీరింగ్ కళాశాల, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ మెదక్ రోడ్, ఓయూ పీజీ కాలేజ్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ పక్కన, ప్రతిభ డిగ్రీ, పిజి కాలేజ్, వికాస్ హై స్కూల్, శ్రీవాణి హై స్కూల్ మైత్రివనం ఎక్సైజ్ ఆఫీస్ పక్కన, ప్రతిభ జూనియర్ కాలేజ్ మెదక్ రోడ్, న్యూ జనరేషన్ జూనియర్ కాలేజ్ మెదక్ రోడ్, గవర్నమెంట్ గర్ల్స్ హై స్కూల్ కోర్టు వెనకాల, శ్రీ చైతన్య స్కూల్ రంగదాంపల్లి గ్రామ శివారు, టీఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్ గర్ల్స్ జూనియర్ కాలేజ్ మిట్టపల్లి గ్రామ శివారు వెల్కటూర్ రోడ్, సురభి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ కాలేజ్ మిట్టపల్లి గ్రామ శివారు, అంబిటాస్ స్కూల్ భారత్ నగర్ సిద్దిపేట, బ్రిలియంట్ మైండ్స్ అండ్ రిసోర్స్ కాలేజ్ బ్లాక్ ఆఫీస్ కోమటి చెరువు బైపాస్ రోడ్డు, జెడ్పిహెచ్ఎస్ ఇంద్రానగర్, గవర్నమెంట్ హై స్కూల్ మెదక్ రోడ్.

దేశ విదేశాల్లో...ఐవిఎఫ్ సేవలు విస్తృతం చేస్తాం

- వైశ్య ఫెడరేషన్ ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు
- ఐవిఎఫ్ జాతీయ అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ గుప్త



నవతెలంగాణ-గజ్వేల్

ఆల్ ఇండియా వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో సేవలను మరింత విస్తృతం చేస్తుండగా, దేశ విదేశాల్లో తమ శాఖల ద్వారా పేదలకు ఆర్థికంగా ఆదుకుంటున్నట్లు ఐవిఎఫ్ జాతీయ అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ గుప్త పేర్కొన్నారు. శనివారం గజ్వేల్‌లో రాష్ట్ర ఉపాధ్యక్షులు, గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి గుప్త అధ్యక్షతన జరిగిన జిల్లా వివిధ విభాగాల ప్రమాణ స్వీకార మహెూత్సవానికి ఆయన హాజరై ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, డిసిసి అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి, ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డిలతో కలిసి ఆయన ప్రసంగించారు. పేద ఆర్యవైశ్యుల ఆర్థిక అభివృద్ధికి రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక కార్పొరేషన్ ప్రకటించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. అంతేకాకుండా రాష్ట్రంలోని పేద ఆర్యవైశ్యుల సంక్షేమం కోసం ప్రభుత్వ పథకాలను వర్తింపజేసే విధంగా కృషి చేయడంతో పాటు నిరంతరం ఐవిఎఫ్ తోడ్పాటునందిస్తుందని తెలిపారు. 26 రాష్ట్రాలలో 500 మందికి పైగా ఉన్నత విద్య కోసం రూ లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందజేయగా, రాష్ట్రంలో సైతం ఇప్పటి వరకు 40 మంది ఆర్యవైశ్య విద్యార్థులను ఆదుకున్నట్లు చెప్పారు. అమెరికా వెళ్లే ఆర్యవైశ్య విద్యార్థులకు అక్కడి ఐవీఎఫ్ ఎన్ఆర్ఐ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని, ప్రపంచ దేశాలలోని ఉన్నతంగా జీవిస్తున్న ఆర్య వైశ్యులు గ్రామీణ ప్రాంతాలలోని పేద ఆర్యవైశ్యులకు సహకారం అందించాలని కోరారు. గత కేసీఆర్ ప్రభుత్వం సైతం ఆర్యవైశ్యుల అభివృద్ధికి సహకరిస్తూ కళ్యాణ మండపాలకు స్థలాలు, నిర్మాణం కోసం నిధులు కేటాయించినట్లు గుర్తు చేశారు. ముఖ్యంగా ఆర్య వైశ్య వ్యాపారులు చెల్లించే రూ లక్షల కోట్ల ట్యాక్స్‌తో ప్రభుత్వ పథకాలు కొనసాగుతుండగా, దాతృత్వం, సేవా భావం, త్యాగం ఒక వైశ్యులకే ఉంటుందని స్పష్టం చేశారు. అయితే వైశ్యులు ఐక్యంగా ఉంటూ రాజకీయంగా ఎదిగి హక్కులు సాధించుకోవాల్సి ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వివిధ విభాగాల అధ్యక్షులు నేతి శ్రీనివాస్ గుప్త, ఎన్నీ సంతోష్ గుప్త, కాసనగుట్టు స్వప్న గుప్త, గజ్వేల్ శాఖ అధ్యక్షులు కైలాస ప్రభాకర్ గుప్త, యువజన విభాగం అధ్యక్షులు కొమురవెల్లి శ్రవణ్ గుప్త, మున్సిపల్ కౌన్సిలర్లు ఉప్పల మెట్టయ్య గుప్త, అత్తెల్లి శ్రీనివాస్ గుప్త, కిరాణ వర్తక సంఘం అధ్యక్షుడు సిద్ధి బిక్షపతి గుప్త, కాటన్ అండ్ గ్రేన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్ గుప్త, వాసవి క్లబ్ అధ్యక్షులు జగ్గయ్య గారి శేఖర్ గుప్త, ఐఎంఏ గజ్వేల్ శాఖ అధ్యక్షులు డాక్టర్ లింగం గుప్త, రాష్ట్ర నేతలు కొడిప్యాక నారాయణ గుప్త, నంగునూరి సత్యనారాయణ గుప్త, తోట బిక్షపతి గుప్త, గోలి సంతోష్ గుప్త, అంతునూరి శివకుమార్ గుప్త తదితరులు పాల్గొన్నారు.





ఆకట్టుకున్న కళారూపాలు

ఆర్యవైశ్య ఫెడరేషన్ ప్రమాణ స్వీకారం సందర్భంగా ఏర్పాటు చేసిన ఆటలు పాటలు పలువురిని ఆకట్టుకున్నాయి. వైశ్య సమాజం కదిలి వచ్చి కళారూపాలను తిలకించారు. ఆర్య వైశ్య ఫెడేషన్ నాయకులు నేతి చిన్న సంతోష్ ఆధ్వర్యంలో కార్యక్రమం విజయవంతంగా కొనసాగింది. వేలాది కుటుంబాలు కదిలి వచ్చి ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు.

రామోజీకి ఘనంగా నివాళులు

నవ తెలంగాణ-సిద్దిపేట

ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ చెరుకూరి రామోజీరావు మృతి చెందడం బాధాకరమని ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కలకుంట్ల రంగాచారి అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శనివారం రామోజీరావు మృతికి సంతాపం వ్యక్తం చేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామోజీరావు పత్రికా రంగానికి ఎనలేని సేవలు అందించి విప్లవత్మకమైన మార్పులు తెచ్చారని కొనియాడారు. రామోజీరావు నెలకొల్పిన సంస్థలు ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందాయని తెలిపారు. ఒక సాధారణ వ్యక్తిగా సిద్దిపేట పట్టణంలో ఏజెన్సీ ఏర్పాటు విషయమై ఆర్టీసీ బస్సులో ప్రయాణ ప్రాంగణానికి చేరుకొని, అక్కడి నుంచి సైకిల్‌పై గాంధీ చౌక్ వరకు చేరుకొని సీనియర్ పాత్రికేయులు విశ్వనాథంతో ఏజెన్సీని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. పత్రికా రంగంలో మొట్టమొదటిసారిగా కలర్ ప్రింట్‌తో పాటు, జిల్లా స్థాయి వార్తల ప్రచురణకు ఆద్యం పోశారని తెలిపారు. సామాన్య ప్రజలకు పత్రిక ఉపయోగపడే విధంగా కార్యక్రమాల రూపకల్పన చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారని తెలిపారు. అనంతరం విలేకరులు మాట్లాడారు. రామోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విలేకరులు అరుణ్ కుమార్, సత్యనారాయణ, రాజిరెడ్డి, దుర్గారెడ్డి, రఘు, రమణారావు, యాదవ రెడ్డి, పాండు, జనార్దన్, ఇంద్రసేనారెడ్డి, మజ్జు, భాస్కర్, సాజిద్, శ్రీనివాస్, నరేష్, వెంకట్, గిరి, శ్రీనాథ్, రమణారెడ్డి, నగేష్, మహేష్, మురళీ, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-గజ్వేల్

ఈనాడు దినపత్రిక అధినేత చెరుకూరి రామోజీరావు శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఈ సందర్భంగా గజ్వేల్ పట్టణం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పాత్రికేయులు, ప్రజా సంఘాల నాయకులు ఉపాధ్యాయులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు తాడెం యాదగిరి, దుర్గం అశోక్ గౌడ్, ఎల్లారావు, మధుసూదన్ రెడ్డి, నాయిని యాదగిరి, ఉపాధ్యాయులు మల్లికార్జున్, వివిధ పార్టీల నాయకులు అంక్షారెడ్డి, ప్రభాకర్, అరవింద్, పేపర్ శ్రీనివాస్, మద్ది నరేందర్, నాగరాజుగౌడ్, అల్వాల యాదగిరి, కృపానందం పాల్గొన్నారు.

నవతెలంగాణ-గజ్వేల్

ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీ రావు మరణం తెలుగు ప్రజలకు సినీ రంగానికీ మీడియాకు, జర్నలిజానికి తీరని లోటని యువజన సంఘాల





రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాతీయ యువజన అవార్డు గ్రహీత దేశబోయిని నర్సింహులు అన్నారు. తెలుగు వాడి సత్తాను యావత్ ప్రపంచానికి చాటి చెప్పిన రామోజీరావు చిరస్మరణీయులు. పత్రిక, టీవీ, సినిమా తదితర రంగాల్లో రామోజీరావు సాధించిన విజయాలు ఆయనకు మాత్రమే కాకుండా యావత్ తెలుగు జాతికి గర్వకారణం . అక్షరానికి సామాజిక బాధ్యత ఉందని నిరూపించారు. సమాజ హితం కోసం మీడియా ద్వారా కృషి చేశారు. ఏ రంగంలో అడుగుపెట్టినా.. తనదైన ముద్ర వేశారు. ప్రతి వ్యాపారంలో అగ్రగామిగా నిలిచారు. ఒక చిరుద్యోగిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన రామోజీ రావు వేల మందికి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదిగారు. ఎంతో మంది కుటుంబాల్లో వెలుగు నింపారు. తెలుగు భాషను కాపాడేందుకు ఆయన చేసి కృషి ఎంతో గొప్పది జర్నలిజం, సాహిత్య రంగాల్లో ఆయన చేసిన కృషి గొప్పదన్నారు. సమాజ సేవ చేసి ఎంతో మంది గుండెల్లో నిలిచిపోయారు. తెలుగు సినీ రంగానికీ తెలుగు మీడియాకు, జర్నలిజానికి వారు చేసిన విశేష కృషి చిరకాలం నిలిచిపోతుందని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటిస్తు వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నామన్నారు.

బడీడు పిల్లలు బడిలో..తల్లిదండ్రులు పనిలో


- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ
- ప్రజా భవన్ యందు సెర్ప్,వీఓఏలతో సమావేశం
- అమ్మ ఆదర్శ పనులు,ఏకరూప దుస్తుల తయారీపై సమీక్ష
- సమస్యలను నేరుగా దృష్టికి తీసుకురావాలని సూచన



నవతెలంగాణ-బెజ్జంకి: పాఠశాలలు పునః ప్రారంభమయ్యే సమయం అసన్నమైందని..గ్రామాల్లో బడీడు పిల్లలందరూ బడిలో ..తల్లిదండ్రులు పనిలో ఉండాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీలోని ప్రజా భవన్ యందు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మండల సెర్ప్ ఉద్యోగులతో పాటు అయా గ్రామాల వీఓఏలు, మహిళ గ్రామైక్య సంఘాల అధ్యక్షులతో అమ్మ ఆదర్శ పనులు, విద్యార్థులకు ఉచిత పంపిణీ చేసే ఏకరూప దుస్తుల తయారీపై సమీక్షా సమావేశం నిర్వహించారు. బడీడు పిల్లలందరూ బడిలో చదువుకునే విధంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తూ పాఠశాలల్లోని సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సూచించారు. బ్లాక్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కీస రత్నాకర్ రెడ్డి,యూత్ రాష్ట్ర కార్యదర్శి పులి కృష్ణ, జిల్లాధికార ప్రతినిధి పోతిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా కార్యదర్శి చిలివేరు శ్రీనివాస్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పులి సంతోష్, ఏఈ సమ్మయ్య, ఏపీఎం నర్సయ్య, సీసీలు సారయ్య, తిరుపతి, పద్మ, మండల సమైక్య అధ్యక్షురాలు మంజుల, మండల అన్ని గ్రామ సంఘాల వివోఏలు పాల్గొన్నారు.

విద్యార్థుల యూనిఫామ్ తయారీ పనుల్లో వేగం పెంచాలి

- డిఆర్డిఓ జయదేవ్ ఆర్య



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందించే యూనిఫామ్‌ల తయారీ పనులలో వేగం పెంచాలని సిద్దిపేట డిఆర్డిఓ జయదేవ్ ఆర్య అన్నారు. శనివారం హుస్నాబాద్ మండలంలోని పోతారం ఎస్ గ్రామంలోని శ్రీ శక్తి స్వశక్తి టైలరింగ్ యూనిట్‌ను డిఆర్డిఓ జయదేవ్ ఆర్య సందర్శించారు. పాఠశాలలో ప్రారంభం కానున్న నేపథ్యంలో స్కూల్ యూనిఫామ్‌లను త్వరగా కుట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ ప్రాజెక్ట్ మేనేజర్ విద్యాసాగర్, సేర్ప్ ఏపిఎం జి శ్రీనివాస్ గౌడ్, చేర్యాల ఏపిఎం ప్రకాశ్, కోహెడ ఏపీఎం తిరుపతి గౌడ్, ప్రసాద్, సీసీలు బిక్షపతి, రవీందర్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత పర్యావరణ పరిరక్షణపై అవగాహన

- బాలవికాస ప్రాజెక్టు కోఆర్డినేటర్ వసంత



నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

వ్యక్తిగత శుభ్రత పర్యావరణ పరిరక్షణ మెనుస్టువల్ కప్ ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలని బాలవికాస ప్రాజెక్టు కోఆర్డినేటర్ వసంత అన్నారు. శనివారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో బాలవికాస మహిళ సభ్యులకు మహిళలకు రుతుచక్రంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవ మనగడ సృష్టి రుతు చక్రంపై ఆధారపడి ఉంటుందని మహిళలు దానిని ధైర్యంగా చర్చించుకోవాలని ఆరోగ్యంపై దృష్టి పెట్టాలన్నారు. ప్లాస్టిక్ వాడటం వల్ల అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని మెనుస్టువల్ కప్ వాడడం వల్ల వ్యక్తిగత పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ కాపాడుకుంటామన్నారు. 18 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాలు మహిళలు కప్పులను వాడాలని సూచించారు. వీటిని 10 సంవత్సరాల వరకు ఉపయోగించుకోవచ్చని ఖర్చు కూడా తగ్గుతుందన్నారు. అమెజాన్ ఆర్థిక సహాయంతో బాలవికాస ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు ప్రతి మహిళ వీటిని ఉపయోగించుకొని వ్యక్తిగత పరిశుభ్రత కుటుంబాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి మహిళపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మి, ఏరియా కోఆర్డినేటర్ సుజాత, లక్ష్మి, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఉపాధిహామీ కూలీల వద్దకు బడిబాట



నవతెలంగాణ-నంగునూరు

బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం ఘనపూర్ గ్రామంలో నంగునూరు ఉన్నత పాఠశాల, ఘనపూర్ ప్రాథమిక పాంశాల ఉపాధ్యాయులు ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి కరపత్రాలను అందజేశారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యాబోధన లభిస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా ఉచిత పాఠ్యనోట్ పుస్తకాలు, రెండు జతల దుస్తులు అందించడం జరుగుతుందని చెప్పారు. పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం తదితర వసతులపై వారికి వివరించారు. ఇన్ని అవకాశాలు సద్వినియోగం చేసుకోని తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నంగునూరు ఉన్నత పాఠశాల ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయులు డి.రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయులు సత్యనారాయణ రెడ్డి, రాజిరెడ్డి, వంశీకృష్ణ, ఘనపూర్ ఉపాధ్యాయులు వెంకటేశం, సువర్ణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.